


నేడు చంద్రబాబు ట్రాన్సిట్ హాల్ట్



విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సోమవారం జిల్లాలో ట్రాన్సిట్ హాల్ట్ చేస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఉండవల్లిలో తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి శ్రీకాకుళం వెళ్లి, బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4.45 గంటలకు శ్రీకాకుళం నుంచి రోడ్డు మార్గాన 6.30గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడి నుంచి విమానంలో 6.40 గంటలకు గన్నవరం బయలుదేరుతారు.

వైసీపీలో గందరగోళం





ఎంపీవీ సత్యనారాయణ

ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు తుది అభ్యర్థులు కాదంటున్న వైవీ సుబ్బారెడ్డి

- వచ్చే నెల మూడో తేదీ తర్వాతే జాబితా ప్రకటిస్తామని వెల్లడి
- ఆశావహులతోపాటు నేతలు, కార్యకర్తల్లో ఆందోళన
- ఇప్పటికే 99 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ, జనసేన కూటమి
- ఇంకా వేచి చూసే ధోరణిలోనే వైసీపీ అధిష్ఠానం



తిప్పల నాగిరెడ్డి



ఉరుకూటి రామచంద్రరావు



అదీప్‌రాజు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎవరనే దానిపై ఆ పార్టీ నాయకుల్లో గందరగోళం మరింత పెరుగుతున్నది. ప్రస్తుత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఫైనల్ కాదని, వచ్చే నెల మూడో తేదీ తరువాతే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. టీడీపీ, జనసేన కూటమి దాదాపు వంద మంది అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల కదన రంగంలోకి దిగుతుండగా... ఇంకా అభ్యర్థులను ప్రకటించడానికే సమయం పట్టేలా ఉందని వైసీపీ అగ్రనేతలు చెబుతున్నారు. ఇది వైసీపీ విజయావకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కిందిస్థాయి నాయకులు అభిప్రాయపడుతున్నారు.

- విజయావకాశాలపై ప్రతికూల పభావం పడుతుందంటున్న నేతలు, కార్యకర్తలు

రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నికల వేడి రాజుకుంది. అధికారం నిలబెట్టుకోవాలని వైసీపీ... అత్యధిక సీట్లు దక్కించుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తెలుగుదేశం, జనసేన పార్టీలు వ్యూహాలను రచిస్తున్నాయి. ఇందులో భాగంగా వైసీపీ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పలుమార్లు సర్వేలు నిర్వహించింది. గెలుపు అవకాశాల్లేవని గుర్తించిన సమన్వయకర్తలను తొలగించి, సమర్థులుగా భావించిన వారిని నియమించింది. పనితీరు బాగాలేని ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించింది. మరికొందరు ఎమ్మెల్యేలను ఇతర నియోజకవర్గాలకు మార్చి, వారి స్థానంలో కొత్త వారిని నియమించింది.

మార్పులతో తంటాలు

విశాఖ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్తగా ఉన్న అక్కరమాని విజయనిర్మలకు ప్రజల్లో పెద్దగా ఆదరణ లేదనే కారణంతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను సమన్వయకర్తగా వైసీపీ నియమించింది. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పనితీరు సరిగా లేదంటూ కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును నియమించింది. దీనిపై ఎమ్మెల్యే నాగిరెడ్డి అభ్యంతరం వ్యక్తంచేయడంతో పాటు ఉరుకూటికి తప్ప మరెవరికి అవకాశం ఇచ్చినా అభ్యంతరం లేదని బాహాటంగానే స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేస్తున్న సమావేశాల్లో సమన్వయకర్తగా ఉన్నంతమాత్రాన పార్టీటికెట్ ఖరారైనట్టు కాదని ఎమ్మెల్యే వ్యాఖ్యానిస్తుండడం ద్వితీయ శ్రేణి నేతలను, కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నది. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ని మార్చేస్తారనే ప్రచారం జరుగుతోంది. అతని స్థానంలో పలువురి పేర్లు తెరమీదకి వస్తున్నాయి.

అనకాపల్లి ఎమ్మెల్యే, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కాదని పార్టీ అధిష్ఠానం నియోజకవర్గ సమన్వయకర్తగా మలసాల భరత్‌ను నియమించింది. తానే అభ్యర్థినంటూ ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తూ సభలు, సమావేశాలు

... మిగతా 6వ పేజీలో

గందరగోళంగా గ్రూప్-2 పరీక్ష ప్రశ్నాపత్రం

గ్రూప్-2 అభ్యర్థులకు చుక్కలు

- ఇండియన్ సొసైటీలో కఠినంగా ప్రశ్నలు
- జాగ్రఫీలో అవుటాఫ్ సిలబస్
- సుదీర్ఘంగా మెంటల్ ఎబిలిటీ ప్రశ్నలు
- కటాఫ్ మార్కులు తగ్గుతాయని అభ్యర్థుల ఆవేదన
- ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వసతులు మృగ్యం
- పలుచోట్ల తాగునీరు కూడా అందుబాటులో ఉంచని యంత్రాంగం



ఎంఎల్‌బీటీ స్కూల్‌లో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ అశోక్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష (స్ర్కీనింగ్ టెస్ట్) ప్రశ్నపత్రం అత్యంత కఠినంగా ఇవ్వడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నెలల తరబడి కోచింగ్ తీసుకున్నా జవాబులు రాసేందుకు సమయం సరిపోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మెయిన్స్‌కు అర్హత సాధించే విషయంలో కటాఫ్ మార్కులు తగ్గుతాయని, ఎక్కువ మంది స్ర్కీనింగ్ పరీక్షలో ఫెయిలవుతారని అంటున్నారు.

అంతా గందరగోళం

స్ర్కీనింగ్ పరీక్షలో 150 మార్కులకు ప్రశ్నపత్రం ఇచ్చారు. ఇందులో చరిత్ర 30, జాగ్రఫీ 30, ఇండియన్ సొసైటీ 30, మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, రీజనింగ్ 30, కరెంట్ అఫైర్స్ అండ్ జీకే 30 మార్కులకు ప్రశ్నలున్నాయి. మొత్తం 150 ప్రశ్నలకు 150 నిమిషాల్లో జవాబులు రాయాలి. చరిత్రకు సంబంధించి ప్రశ్నలు సులువుగా ఉన్నాయి. జాగ్రఫీలో కొన్ని ప్రశ్నలు ఏపీపీఎస్సీ సిలబస్‌కు సంబంధంలేనివి ఇవ్వడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. ఇండియన్ సొసైటీ అనేది కొత్తగా ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన మెటీరియల్ కొద్దిరోజుల క్రితమే తెలుగు అకాడమీ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో ఎక్కువగా సోషియాలజీ, న్యాయ సంబంధమైన సెక్షన్లు, రాజ్యాంగ సవరణలపై ప్రశ్నలు ఇచ్చారు. సాధారణంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలలోనే ఇటువంటి ప్రశ్నలు వస్తాయని పలువురు అభ్యర్థులు చెబుతున్నారు.



ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద టీ సెంటర్‌లో బ్యాగుల కోసం అభ్యర్థుల పాట్లు

మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, రీజనింగ్‌లో కొన్ని ప్రశ్నలకు విద్యార్థులు కాలిక్యులేటర్ లేకుండా జవాబులు రాయడం సాధ్యంకాదని ఏయూలో పరీక్ష రాసిన మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. మెయిన్ ఆప్షన్‌గా గణితం తీసుకున్న వారు కూడా ఒక ప్రశ్నకు నిమిషంలో జవాబు రాయలేరన్నారు. కరెంట్ అఫైర్స్‌లో ప్రస్తుత పరిస్థితులపై కాకుండా చరిత్రపై ప్రశ్నలు ఇవ్వడం దారుణమన్నారు. ఇదిలా వుండగా పరీక్షకు సంబంధించి తెలుగు అకాడమీ ప్రామాణికమైన పుస్తకాలు అందుబాటులో లేవని పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసినా ఫలితం కనిపించలేదని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ వాపోయారు. పరీక్ష నెల రోజులు వాయిదా వేసి మెటీరియల్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

అభ్యర్థులకు ఇక్కట్లు


ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష

... మిగతా 6వ పేజీలో

అందుబాటులోకి ఆహార ప్రయోగశాల

- జాతికి అంకితమిచ్చిన ప్రధాని మోదీ
- రూ.4.77 కోట్ల సీఎస్ఎస్ నిధులతో ఏర్పాటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆహార ప్రయోగశాలలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జాతికి అంకితమిచ్చారు. పెదవాల్తేరు లోని ఈఎన్‌టీ ఆస్పత్రి పక్కన ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయో గశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆహార ప్రయోగశాలను ఆదివారం ఉదయం గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ ప్రారంభోత్సవం చేసి, జాతికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ వికసిత్‌భారత్‌లో భాగంగా ఈ తరహా ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. వర్చువల్ విధానంలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జ్యోతి ప్రజ్వలన చేసి, బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో రూ.4.77 కోట్లతో ఏర్పాటు చేసిన మైక్రో బయాలజీ ల్యాబ్‌ను ప్రధాని ప్రారంభించారన్నారు. ఈ ల్యాబ్ రాష్ట్రానికే గుండె లాంటిదన్నారు. డయేరియా, ఇతర సమస్య లు వచ్చినప్పుడు ఆహారం, నీటి నమూనాలను సేకరించి, ఎక్కువ సంఖ్యలో పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రయోగశాలకు త్వరలో 80 మంది సిబ్బం దిని రాష్ట్ర ప్రభుత్వం నియమించనుందన్నారు. విశాఖలో మైక్రో బయాలజీ ల్యాబ్ ఏర్పాటు చేసినందుకు, ప్రధానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐపీఎం డైరెక్టర్ పూర్ణచంద్రరరావు, ఎన్‌హెచ్ఎం డీడీ గణపతిరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ డి.అచ్చెన్నాయుడు, ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ నందాజీ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

అబ్బురపరిచిన సీ ఫేజ్ విన్యాసాలు

- నౌకదళ శక్తి సామర్థ్యాలను తెలియజేసేలా నిర్వహణ

- వివరాలు 6వ పేజీలో



ఆరోగ్యశాఖ ఉద్యోగులకు వేతనాలేవీ?

- మరో మూడు రోజుల్లో ముగియనున్న ఫిబ్రవరి
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మూడు వేల మందికి నిరాశ
- ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో ఉద్యోగుల్లో ఆందోళన

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న రెండు వేల మందికిపైగా ఉద్యోగులకు జనవరి నెల వేతనాలు ఇంకా అందలేదు. ఈ నెల రెండు, మూడు తేదీల్లో చెల్లించాల్సిన ఉన్నప్పటికీ నెలాఖరు వచ్చినా జమ కాకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల్లో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, సెకండ్ ఏఎన్ఎంలు ఉన్నారు. వీరిలో గరిష్ఠంగా రూ.90 వేల నుంచి కనిష్ఠంగా రూ.15 వేలు వరకు వేతనాలు తీసుకునే వారున్నారు. సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొద్ది నెలలుగా చెల్లింపులు ఆలస్యమవుతున్నాయంటున్నారు. గత నెలలో పది రోజులు ఆలస్యమయ్యాయని, ఫిబ్రవరి చివరి వారం వచ్చినా జమ కాలేదని, ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

నగర పరిధిలోని కేజీహెచ్, విమ్స్‌తోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. వేతనాల జాప్యంపై అధికారులను ఉద్యోగులు కలిసి విన్నవిస్తున్నారు. సకాలంలో చెల్లించేలా చూడాలని కోరుతున్నారు. అధికారులు నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. చాలీ, చాలని వేతనాలతో పనిచేస్తున్న ఎంతో మంది ఉద్యోగులున్నారని, చెల్లింపుల్లో జాప్యం కావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉద్యోగులు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

ఉన్నవాటికే వసతుల్లేవ్!

- తరగతి గదులు, ల్యాబ్‌లకు దిక్కు లేదు
- అధ్యాపకులు, సిబ్బంది నియామకాలపై సందిగ్ధం
- ఉన్నత పాఠశాలల్లో కొత్తగా మరో మూడు జూనియర్ కళాశాలలు
- రెడ్డిపల్లి, వెంకటాపురం, కురుపాం మార్కెట్‌లో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- ఈ ఏడాది జూన్ నుంచి తరగతుల ప్రారంభానికి సన్నాహాలు
- ప్లస్‌టూకు కనిపించని విద్యార్థుల ఆదరణ



ఎంవీడీఎం స్కూల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో కొత్తగా మూడు ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలను ప్రారంభించనున్నారు. మూడు చోట్ల కో-ఎడ్యుకేషన్ (బాలురు, బాలికలు) కు ఇంటర్ తరగతులు బోధించనున్నారు. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పాఠశాల విద్య పూర్తిచేసుకున్న విద్యార్థులకు మాధ్యమిక విద్య అందించాలన్న కేంద్ర ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ప్రతి మండలంలో బాలికలకు ఒకటి, బాలురు, బాలికలకు కలిపి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

జిల్లాలోని 11 మండలాల్లో 19 ప్రభుత్వ జూనియర్ /ఒకేషనల్/ మహిళా కళాశాలలు/ కేజీబీవీలు/ హైస్కూలు ప్లస్ ఉండగా మరో మూడు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా పద్మనాభం మండలం రెడ్డిపల్లి, గోపాలపట్నం మండం హెచ్‌సీ వెంకటాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, నగరంలోని కురుపాం మార్కెట్‌లో ఎంవీడీఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలు ప్రారంభించనున్నారు.

ప్రభుత్వ ఉద్దేశం బాగానే ఉన్నా... క్షేత్రస్థాయిలో వాటి అమలుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నెలకొల్పిన జూనియర్ కళాశాలలు మినహా గత పదేళ్లలో ఆనందపురం, చంద్రంపాలెం ఉన్నత పాఠశాలల్లో కొత్తగా ఏర్పాటు చేయగా, అక్కడ అరకొర సదుపాయాలతో కొనసాగుతున్నాయి. ఆనందపురం ఉన్నత పాఠశాలలో కేవలం నాలుగు గదుల్లో కళాశాల నడుస్తోంది. ఇక్కడ ప్రిన్సిపాల్ మినహా మిగిలిన అధ్యాపకులంతా గెస్టు ఫ్యాకల్టీలే. మధురవాడలో వసతి బాగానే ఉన్నా ఇక్కడా ప్రిన్సిపాల్ తప్ప స్టాఫ్ మొత్తం అతిథి అధ్యాపకులే.

మంజూరుకాని పోస్టులు

రెండేళ్ల క్రితం ఉన్నత పాఠశాలల్లో ప్రారంభించిన హైస్కూలు ప్లస్‌కు సంబంధించి కొత్తగా ప్రిన్సిపాళ్ల, అధ్యాపక పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయలేదు. నగరంలోని సీతమ్మధార, మల్కాపురం మునిసిపల్ ఉన్నత పాఠశాల, పెందుర్తి మండలం రాంపురం, గోపాలపట్నం బాలికలు, గంగవరం, గాజువాక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో హై స్కూలు ప్లస్ నెలకొల్పారు. ఆయా చోట్ల జిల్లాలో అందుబాటులో ఉన్న స్కూలు అసిస్టెంట్లలో పీజీ అర్హత గల టీచర్లతో తరగతులు బోధించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఆయా

... మిగతా 6వ పేజీలో



ఫ్లోటింగ్ బ్రిడ్జిపై మంత్రి అమర్‌నాథ్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తదితరులు

అలలపై తేలిపోదాం

- తీరంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రారంభం

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులోని వైఎంసీఏ ఎదురుగా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జ్ సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. దీనిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, కలెక్టర్ మల్లికార్జున ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీ మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో కైలాసగిరి, ఆర్కే బీచ్, భీమిలి తదితర ప్రాంతాల్లో పనులు చేపట్టామన్నారు. సాగర తీరంలో 25 కిలోమీటర్ల మేర పలు ప్రాజెక్టులు రూపొందుతున్నాయని, కైలాసగిరి వద్ద రూ.5 కోట్లతో స్కై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్వహణను పర్యవేక్షించేందుకు వీఎంఆర్‌డీఏ నుంచి ఒక అధికారిని నియమించామన్నారు. పర్యాటకులు వంతెనపైకి వెళ్లినప్పుడు నిత్యం రెండు బోట్లు సంచరిస్తాయని, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కేకే రాజు, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి డి.కీర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఆధునికీకరించిన విశాఖ మ్యూజియాన్ని సందర్శించారు. కళారూపాలను, చిత్రాలను, దేవతా మూర్తుల విగ్రహాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా ఫ్లోటింగ్ బ్రిడ్జిని ప్రారంభించినప్పటికీ పర్యాటకులకు అందుబాటులోకి రాలేదు. సాయంత్రం పలువురు అక్కడికి వెళ్లగా అనుమతి లేదని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మాఘమాస వేడుకలు



లీలామాధవస్వామి ఆలయం వద్ద జన సందోహం

మురళీనగర్, ఫిబ్రవరి 25; మాఘమాసం వేడుకలు ఆదివారం మాధవ ధారలోని శ్రీ లీలామాధవస్వామి పుణ్యక్షేత్రంలో వైభవంగా జరిగాయి. ఉదయం జలధార వద్ద పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, వేణుగోపాల స్వామి, లీలా మాధవస్వామి మందిరాలను దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. సహజసిద్ధ జల ధారల వద్ద రద్దీ వాటర్ ట్యాంకుల ద్వారా పైపులైన్లను అమర్చి స్నానాలకు ప్రత్యేక షవర్‌లను ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీ లీలామాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల తర్వాత దాత సాయంతో 2 వేల మందికి అన్నదానం చేశారు.

పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి

సీతమ్మధార, ఫిబ్రవరి 25: జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా పిల్లలను తీర్చిదిద్దాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్ పేర్కొన్నారు. బుల్లయ్య కళాశాల్లో గాంధీ సెంటర్‌లో విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో 'పిల్లల విద్యలో రావాల్సిన మార్పులు' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కులు, ర్యాంకులంటూ పిల్లలపై ఒత్తిడి పెంచడం తగదన్నారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచాలన్నారు. గాంధీ సెంటర్ అధ్యక్షులు, నాగార్జున యూనివర్శిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ, పిల్లలో అనేక మేధోపరమైన ప్రత్యేకతలుంటాయన్నారు. వాటిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ అధ్యక్షులు నరవ ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్కు కమిటీ ప్రమాణ స్వీకారం

మాధవధార, ఫిబ్రవరి 25; పార్కుల్లో కాలనీవాసులందరికీ సమ ప్రాధాన్యం ఉంటుందని మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కు అసోసియేషన్ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పార్కు (స్కేటింగ్ పార్కు)లో 2024 నుంచి 2026 వరకు ఎన్నికైన కొత్త కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలనీ వాసులందరికీ పార్కుల్లో ఉచిత ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మహిళల నుంచి, యువత, పిల్లల్లో క్రీడల్లో పాల్గొనే చూస్తామన్నారు. అనంతరం పార్కు పాత కమిటీ సభ్యులను సత్కరించారు. అధ్యక్షుడిగా సనపల.వరప్రసాద్, కార్యదర్శి పి.వి.ఎస్.రాజు, ఉపాధ్యక్షునిగా పల్లా.చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసారు. కాలనీ వాసులు, పార్కు శాశ్వత కమిటీ సభ్యులు, యువత, మహిళలు కార్యక్రమంలో ఉన్నారు.

నృసింహ యజ్ఞానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న దేవస్థానం చైర్మన్ అశోక్ గజపతిరాజు

సింహాచలం, ఫిబ్రవరి 25 : లోకకల్యాణార్థం సింహాచలంలో ఫాల్గుణమాస బహుళ పక్ష విదియ నుంచి చతుర్వేద హవన పూర్వక పాంచాహ్నిక పంచకుండాత్మక యజ్ఞం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం సంప్రదాయ రీతిలో భూమి పూజ చేశారు. స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో వాస్తుపురుష పూజ, భూమి పూజ చేశారు. అనంతరం హలానికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు సతీసమేతంగా కర్షణానికి (దున్నేందుకు) లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ యజ్ఞం నిర్వహణకు దాతల సహకారంతో మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. యజ్ఞంలో పాల్గొనేందుకు విధి విధానాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. కాగా అంతకుముందు అశోక్ దంపతులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు అశోక్‌కు శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. ఈవో ప్రసాదాలను అందజేశారు. పూజలో పాలకమండలి సభ్యులు ఈఈ డీజీ శ్రీనివాసరాజు, ఏఈఓ పి.నరసింగరావు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ మేయర్'

» జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబరు 18004250009

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఎవరికైనా పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ యూసీడీతోపాటు హార్టికల్చర్ విభాగాలకు సంబంధించి సమస్యలు ఉంటే సోమవారం ఉదయం పది నుంచి 11 గంటల మధ్య టోల్‌ఫ్రీ నంబరు 18004250009కి ఫోన్ చేయాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఫోన్‌కాల్స్‌ను స్వయంగా తానే స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి గ్రీవెన్స్ తీసుకుంటామన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఆకట్టుకున్న మియావాకి స్టోరీ టైమ్

సీతంపేట, ఫిబ్రవరి 25: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో లైబ్రరీ సొసైటీ, భారతీయ విద్యా భావన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మియావాకి స్టోరీ టైమ్ కార్యక్రమం ఆకట్టుకుంది. కమిషిబాయి అని పిలవబడే సంప్రదాయ జపనీస్ కథ చెప్పే పద్ధతిలో కథా విధానంపై చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. బెంగళూరులోని కథాలయ ఫౌండేషన్‌కు చెందిన సర్టిఫైడ్ కథకురాలు వరలక్ష్మి కమిషిబాయి.. చెక్క వేదికగా, చిత్రపటాలను ఉపయోగించి ఓ భారతీయ జానపద కథను పిల్లలకు వినిపించారు.

'టీడీపీ,జనసేనతోనే సుస్థిర పాలన '

కంచరపాలెం, ఫిబ్రవరి 25: సుస్థిర పాలన కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించాలని జనసేన ఉత్తర వైసీపీ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ కోరారు. జీవీఎంసీ 48వ వార్డులో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషాకిరణ్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో ప్రజలు అష్టకష్టాలను పడుతున్నారన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొండవాలు ప్రజలకు ప్రమాదాల జరగకుండా రిటర్నింగ్ వాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వార్డు అధ్యక్షుడు ఉప్పులూరి శ్రావణ్, చిక్కాల గీత, పాల్గొన్నారు.

చంద్రబాబుతో గంటా, బాబ్జీ భేటీ



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడును ఉండవిల్లిలో ఆయన నివాసం లో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆదివారం కలుసుకున్నారు. తూర్పు, పశ్చిమ సీట్లు ఖరారుచేసిన నేపథ్యంలో అధినేత నుంచి వీరికి పిలుపువచ్చింది. నేతలిద్దరూ వేర్వేరుగా బాబుతో సమావేశమయ్యారు. పార్టీ వర్గాలు, నేతలు తెలిపిన వివరాల మేరకు... గంటా శ్రీనివాసరావును విజయ నగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని అధినేత సూచించారు. పార్టీ నిర్వ హించిన సర్వే అనుకూలంగా వచ్చిందని పేర్కొం టూ...ఎక్కడ నుంచైనా గెలిచే సత్తా ఉందని సూచించారు. దీనికి గంటా భీమిలి నుంచి పోటీచేస్తానని తెలిపారు. విశాఖప ట్నంలోనే స్థిరడ్డానని, భీమిలి కాకపోతే జిల్లాలోని మరో చోట నుంచి పోటీకి అవకా శం ఇవ్వాలని గంటా కోరగా బొత్స మరో స్థానంలో పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోందని, అదే జరిగితే భీమిలి టిక్కెట్ పరిశీలిస్తానని గంటాకు సూచించారు. అనంతరం దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ, అతని కుమా రుడు వంశీ చంద్రబాబుతో సమా వేశమ య్యారు. దక్షిణ టికెట్ జనసేన కోరు తున్న విషయాన్ని చంద్రబాబు ప్రస్తావిం చారు. దీనికి బాబ్జీ వివరణ ఇస్తూ అధిష్టానం ఆదేశాల మేరకు పెందుర్తి నుంచి వచ్చి రెండేళ్లుగా కష్టపడి పనిచేసి కేడర్‌ను సమాయత్తం చేశానన్నారు. దీంతో ప్రస్తుతం నియోజక వర్గాన్ని వదలొద్దని, కష్టపడి పనిచేయాలని చంద్రబాబు ఆయనకు భరోసా ఇచ్చారు. దీంతో తనకు టికెట్ లభిస్తుందనే నమ్మకం కుదిరిందన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తికి సన్మానం



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహతో న్యాయవాదులు

విశాఖపట్నం(లీగల్), ఫిబ్రవరి 25: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీనరసింహను విశాఖ న్యాయవాదుల సంఘం ఆదివారం సన్మానించింది. విజయనగరంలో కోర్టుల భవన సముదాయా నిర్మాణ శంకుస్థాపనలో భాగంగా నగరానికి వచ్చిన న్యాయమూర్తి విశాఖ జిల్లా కోర్టుల లైబ్రరీలో సంఘం సన్మానించింది. అనంతరం న్యాయవాదుల పలుసమస్యలను వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తు యు. దుర్గాప్రసాద్, ఇతర న్యాయమూర్తులు బార్ అసోసియేషన్ కార్యాలయానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షులు లత, కార్యదర్శి పైలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

బౌద్ధ ధర్మంలో అసమానతలు దూరం

» 11వ బౌద్ధ మహా సమ్మేళనంలో వక్తలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట, ఫిబ్రవరి 25: బౌద్ధ ధర్మంతో అసమానతలు దూరం చేయవచ్చని పలువురు బౌద్ధ మేధావులు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 11వ బౌద్ధ మహా సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బౌద్ధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డాక్టర్ ఆయుపాల మహతేరో, సారిపుత్ర ధర్మ ప్రబోధన చేశారు. వీసీకే అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ప్రముఖ వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, బాంసేఫ్ జాతీయ నాయకులు నల్లా గంగాధర్, బౌద్ధ రచయిత డి. నటరాజ్ సాక్యి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, సొసైటీ రాష్ట్ర కార్యదర్శి వీవీ దుర్గారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వేణుగోపాల్ గౌతమ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వయ్యల సిద్ధార్థలు బౌద్ధంపై పలు అంశాలను ప్రసంగించారు.సావనీర్‌ను ఆవిష్కరించారు.

ఉద్యమాల్లో జయగోపాల్ కృషి మరవలేం

» సంస్మరణ సభలో సీపీఐ నేత సత్యనారాయణ మూర్తి



జయగోపాల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వక్తలు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 25: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉద్యమాల్లో సామాజిక, హేతువాద ఉద్యమకారుడు జయగోపాల్ ప్రభావం ఎంతో ఉందని, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారని సీపీఐ రాష్ట్ర నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం డా.జయగోపాల్ సంస్మరణ సభను భారత నాస్తిక సమాజం , సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునాట జయగోపాల్ తన కుటుంబ సభ్యులందరినీ తనతో ఉద్యమంలో తీసుకువెళ్లారన్నారు. ద్రవిడ కజగం నేత వీరమణి కుమారుడు వి.అంబురాజు మాట్లాడుతూ జయగోపాల్ సాంస్కృతిక సాంఘిక విప్లవకారుడని, యువతకు ఆయన ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. తమిళనాడులో కూడా ఆయన ఆనాడు పెరియర్‌తో కలిసి పని చేశారని గుర్తుచేశారు .విశాఖలోని బీచ్‌రోడ్డులో పెరియార్ విగ్రహం ఏర్పాటుకు జయగోపాల్ కృషి మరవలేనిదన్నారు.మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సీనియర్ పాత్రికేయులు వీవీ రమణమూర్తి జయగోపాల్‌పై మాట్లాడారు. భానాస రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ థామ్సన్ స్ట్రీట్‌లో కోపరేటివ్ స్టోర్ నుంచి 1971లో జయగోపాల్‌తో తన ప్రస్థానం ప్రారంభించారన్నారు.మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ, పాల్తేటి పెంటారావు, లలిత, గంట మోహన్‌రావు, సాయినరేందర్, జె రవి, ఎంవీఆర్ కృష్ణశరత్, పి.అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మేజర్ పోర్ట్సు కబడ్డీ విజేత చెన్నై



చెన్నై పోర్టు జట్టుకు ట్రోఫీ అందిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 26: విశాఖపట్నం పోర్టు స్పోర్ట్సు కౌన్సిల్ నిర్వహించిన 39వ అఖిల భారత మేజర్ పోర్ట్సు కబడ్డీ టోర్నీలో చెన్నై పోర్టు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ట్యుటికొరిన్ పోర్టు రన్నరప్‌గా నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై పోర్టు తృతీయస్థానాన్ని దక్కించుకున్నది. పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో చెన్నై పోర్టు 53-48 స్కోరు తేడాతో ట్యుటికొరిన్ పోర్టుపై విజయం సాధించింది. చెన్నై పోర్టులో స్టువర్ట్ సింగ్ 20, కామేశ్వరన్ 15, దినేశ్‌కుమార్ పది పాయింట్లు సాధించగా, ట్యుటికొరిన్ జట్టులో ఎస్.భరత్ 20, ఎం.వెలన్ 14, మణికండన్ ఎనిమిది పాయింట్లు సాధించాడు. టోర్నీ బెస్ట్ రైడర్‌గా ఎస్.భరత్ (ట్యుటికొరిన్), బెస్ట్ డిఫెండర్‌గా సౌరభ్ రౌత్ (ముంబై), బెస్ట్ ఆల్ రౌండర్‌గా దినేశ్‌కుమార్ (చెన్నై) అవార్డులందుకున్నారు. టోర్నీ ముగింపునకు విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్మన్ డి.దుర్గేశ్ కుమార్ దుబే విజేతలకు ట్రోఫీలు, బహుమతులందజేశారు.

అబ్బురపరిచిన సీ ఫేజ్ విన్యాసాలు

» నౌకదళ శక్తి సామర్థ్యాలను తెలియజేసేలా నిర్వహణ



హెలీకాప్టర్ విన్యాసం

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):మిలా న్-2024లో భాగంగా సముద్రంలో ఆదివారం విన్యాసాలు కొనసాగాయి. ఈ విన్యా సాల్లో భారత్‌తో పాటు మిత్రదేశాలకు చెందిన నేవీ భాగస్వామ్యమ య్యాయి. ఆయా దేశాలకు చెందిన నౌకలు, యుద్ధ విమానాలు, హె లికాప్టర్లు విన్యాసాల్లో పాల్గొన్నాయి. నౌకాదళ శక్తి, సామర్థ్యాలను తెలియజేసేలా సాగాయి. ఉపరితలంలోనే లక్ష్యాలను చేధించడం, వైమానిక లక్ష్యాలకు వ్యతిరేకంగా ఆయుధ కాల్పులు, జలాంతర్గాముల లక్ష్యాలను తిప్పికొట్టే రీతిలో సాగించిన విన్యాసాలు నేవీ సామ ర్థ్యాన్నితెలియ జేశాయి. భారత్‌తోపాటు మిత్ర దేశాల ఆధ్వర్యంలో సముద్రంలో సాగిస్తున్న విన్యాసాలతో ఒకరకంగా యుద్ధ వాతావరణం కనిపించింది. సముద్ర సామర్థ్యాలను, అంతర్జాతీయ సహకారా న్ని పెంపొందించుకునేందుకు అనుగుణంగా విన్యాసాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 27 వరకు రెండో విడత సీ ఫేజ్ విన్యాసాలు కొనసాగనున్నాయి.

'టీడీపీ, జనసేనల అభ్యర్థుల ప్రకటనతో వైసీపీ షాక్'

సీతంపేట, ఫిబ్రవరి 25: అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా టీడీపీ, జనసేన పార్టీలు ప్రకటించిన ఎన్నికల అభ్యర్థుల జాబితాలతో వైసీపీనేతలు షాక్ తిన్నారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన పార్టీలు ప్రజా సమక్షంలో 99 సీట్లు ప్రకటించారని, దీని చూసి వైసీపీ చీఫ్ జగన్ చీప్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. వైసీపీలో సమన్వయకర్తలు అభ్యర్థులు కాదా అని ప్రశ్నించారు.

నిజంగా దమ్ము ఉంటే నేరుగా అసెంబ్లీ అభ్యర్థి అని ప్రకటించాలని, అది మానేసి నియోజకవర్గానికి సమన్వయకర్త అంటున్నారని ఎద్దేవా చేశారు. ఈస్థితిలో ఆ పార్టీలో గల కోడి గుడ్డు మంత్రి అమర్ ఏదేదో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అమర్ ముందు నీ సీట్ ఎక్కడో చెప్పాలన్నారు. ఆ పార్టీకి తీరు తెన్నులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పెంచుతున్న ప్రభుత్వాలు

» ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం దావలే



సమావేశంలో మాట్లాడుతున్న మరియం దావలే

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 25: కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్నాయని, ఈ స్థితిలో ఆహార భద్రత, పట్టణ ఉపాధి హామీపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్టు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఐద్వా కేంద్ర కమిటీ సమావేశాలు ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. సమావేశాల్లో మహిళల సమస్యలపై చర్చించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో మహిళల జీవితాల్లో సంక్షోభం నెలకొంటోందన్నారు. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలనే దానిపై చర్చించాల్సి ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగాలను నాశనం చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా చాలా మందికి పనిలేదు, ఆహారం, చదువు, ఆరోగ్యం లేదన్నారు. ఇటువంటి ప్రభుత్వాలను ఓడించకుంటే సాధారణ ప్రజలు నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో ఆలిండియా అధ్యక్షులు పీకే శ్రీమతి, కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ పాల్గొన్నారు.

అధ్వాన రహదారులను పట్టించుకోరా?

» సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



వన్‌టౌన్ రామకృష్ణా జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 25: పాతనగరంలోని రామకృష్ణా జంక్షన్ రైతుబజారు రోడ్డు అధ్వాన స్థితిపై సీపీఎం నాయకుడు సుబ్బారావు ఆధ్వర్యంలో పలు సంఘాల కార్మికులు ఆందోళన నిర్వహించారు. పాతనగరంలోని రహదారులను తక్షణం అభివృద్ధి చేయాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రామకృష్ణా జంక్షన్‌నుంచి కాన్వెంట్ జంక్షన్ వరకు మార్గం పూర్తి గతుకుల మయంకావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. పూర్ణామార్కెట్‌కు కూరగాయల రవాణా చేసే వాహనదారులు నిత్యం నరక యాతన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రామకృష్ణా జంక్షన్ రైతు బజారు వద్ద ప్రధాన రోడ్డు మార్గంను జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. పోర్టు మార్గం వైపు కొద్ది రోజుల క్రితం బైక్‌పైన వెళ్తున్న గర్భిణి గోతుల్లో పడి ప్రమాదానికి గురైనట్టు చెప్పారు. పాతనగరంలోని ప్రధాన రహదారులన్నీ పాడయ్యాయన్నారు. నిత్యం జనాలు అవస్థలు ఎదుర్కొ కార్య క్రమంలో రిక్షా పుల్లర్స్ యూనియన్ నాయకులు కె.నాగరాజు, నరసింగరావు, అయ్యన్న, మోటారు మెకానిక్ యూనియన్ నాయకులు కె.గణేష్, సీఐటీయూ నాయకులు చంద్రమౌళి, ఎర్రిబాబు , కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి నియోజకవర్గంలో అసమ్మతిపోరు ఎక్కువైంది. పార్టీలోని కొంతమంది నేతలు, కార్యకర్తలు ధర్మశ్రీకి టికెట్ ఇవ్వొద్దంటూ మీడియా సమావేశాలు పెట్టి మరీ స్పష్టం చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ఎమ్మెల్యేగా శెట్టి ఫాల్గుణ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ నియోజకవర్గం సమన్వయకర్తగా ఎంపీ గొడ్డేటి మాధవిని నియమించారు. దీనిపై మండల స్థాయి నేతలు, కార్యకర్తల నుంచి వ్యతిరేకత రావడంతో పార్టీ పెద్దలు ఆమె (మాధవి) స్థానంలో హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగాన మత్స్యలింగంని నియమించారు. పాడేరు ఎమ్మెల్యేగా కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఉండగా.. నియోజకవర్గ సమన్వయకర్తగా మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమించారు.

వైవీ వ్యాఖ్యలతో కలకలం

ఇదిలావుండగా కొత్తగా సమన్వయకర్తలుగా నియమితులైన వారికి, సిట్టింగ్ ఎమ్మెల్యేలే సమన్వయకర్తలుగా ఉన్న వారికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమనే భావన కార్యకర్తల్లో ఉంది. వారంతా తమ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తామే అభ్యర్థులమనే నమ్మకంతో ఎన్నికల ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఈ తరుణంలో శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలను కలవరపాటుకి గురిచేశాయి. అంతేకాకుండా ప్రస్తుత ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలపై అసమ్మతి వున్న నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉంటుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. దీంతో టికెట్ ఎవరికి వస్తుందో తెలియక నేతలు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. మరోవైపు టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతుండగా... అభ్యర్థులు ఎవరన్న దానిపై స్పష్టత లేక వైసీపీ శ్రేణులు నిరుత్సాహంలో కూరుకుపోయాయి.

గ్రూప్-2 అభ్యర్థులకు చుక్కలు

... 5వ పేజీ తరువాయి

రాసిన అభ్యర్థులకు అక్కడ నిర్వాహకులు పలు ఆంక్షలు విధించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు తమతో పాటు తీసుకువచ్చిన బ్యాగులను లోనికి అను మతించలేదు. దీంతో కళాశాలకు ఎదురుగా ఉన్న టీ దుకాణంలో పెట్టుకోవాలని పోలీసులు సూచిం చారు. పరీక్ష రాసిన తరువాత వచ్చిన అభ్యర్థుల నుంచి టీ దుకాణం యజమాని ఒక్కో బ్యాగుకు రూ.30 చొప్పున వసూలు చేశారు. అంతేకాకుండా బ్యాగులు తిరిగి ఇచ్చే సమయంలో గందరగోళం నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్వాకంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని పలువురు ఆరోపించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు రాసిన అభ్యర్థులకు కనీసం తాగునీటి సదుపాయం కల్పించలేదు. అభ్యర్థులు పదేపదే కోరితే ఇన్విజిలేటర్లు తాము తెచ్చుకున్న వాటర్ బాటిల్స్‌ను అభ్యర్థులకు ఇచ్చారు. ఇదిలావుండగా విశాఖ జిల్లాలో మొత్తం 105 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, 47,491 మందికి అభ్యర్థులకు గాను 39,300 (82.75 శాతం) మంది హాజరయ్యారు. అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం కేంద్రాల్లో 10,627 మంది అభ్యర్థులకుగాను 9,060 మంది (85.25 శాతం) పరీక్షకు హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, జేసీ

విశాఖలో ఆదివారం గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష (స్క్రీనింగ్ టెస్ట్) నిర్వహించిన కొన్ని కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సందర్శించారు. వుడా పార్కు ఎదురుగా ఎంఎల్‌బీటీ స్కూలులో ఏర్పాటు చేసిఇన కేంద్రాన్ని తనిఖీచేసి అభ్యర్థుల సంతకాల రిజిస్టర్ పరిశీలించారు. రోల్ నంబరు ప్రకారం సీటింగ్ అరేంజ్‌మెంట్స్ తనిఖీ చేశారు. వారి వెంట కేంద్రం డిపార్టుమెంటల్ అధికారి, కనకమహాలక్ష్మి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ ఉన్నారు.

ఉన్నవాటికే వసతుల్లేవ్!

... 5వ పేజీ తరువాయి

ఉన్నత పాఠశాలల్లోని గదుల్లో కొన్నింటిని హైస్కూలు ప్లస్‌కు కేటాయించారు. ఇక్కడ చదువుకునే సైన్స్ విద్యార్థులకు ఇంత వరకు ల్యాబొరేటరీ సదుపాయం లేదు.

ప్రస్తుతం ద్వితీయ ఇంటర్‌లోకి వచ్చిన సైన్స్ విద్యార్థులు సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలల ల్యాబొరేటరీల్లో తరగతులకు హాజరయ్యారు. ఇందుకోసం ప్రతి విద్యార్థీ కొంత మొత్తం వెచ్చించాల్సి వచ్చింది. సాధారణంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు అదే ఏడాది నుంచి ల్యాబొరేటరీ అందుబాటులో ఉండాలి. కానీ హైస్కూలు ప్లస్‌లోచేరిన విద్యార్థులకు గత ఏడాది ఈ సౌకర్యం లేదు. అంతేకాదు హైస్కూలు ప్లస్‌లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం, షూస్, బ్యాగులు, నోట్‌బుక్స్ ఇవ్వరు. మధ్యాహ్న భోజనం కూడా ఉండదు. సాధారణంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హైస్కూలు ప్లస్‌లో చేరిన వారిలో ఎక్కువమంది పేద వర్గాలకు చెందిన విద్యార్థులే ఉంటారు. అయినప్పటికీ ప్రభుత్వ పరంగా ఎటువంటి సదుపాయాలు అందడంలేదు. పైగా ఇక్కడ తరగతులు బోధించే పీజీటీలకు గత ఏడాది జూన్ నుంచి ఇంతవరకు ఇంక్రిమెంట్లు అందలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా మూడు ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఉన్న వాటికే దిక్కులేదు... కొత్తగా మరిన్ని ఏర్పాటు ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. జూనియర్ కళాశాలలు ఏర్పాటుచేసే ముందు తరగతుల బోధనకు అధ్యాపకులు, ఇతర సిబ్బందిని నియమించాలని, మౌలిక వసతులు సమకూర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు ఉన్నత పాఠశాలల ఆవరణలో కాకుండా మరోచోట భవనాలు నిర్మించి, జూనియర్ కళాశాలలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉచితంగా కంటి వైద్యపరీక్షలు

మహారాణిపేట, ఫిబ్రవరి 25: మధమేహ రోగులకు గ్లుకోమ, రెటీనా కంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని వాసన్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు పీజే శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాఘవేంద్ర స్వామి ఆలయం సమీపంలోని ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో క్యూ లాసిక్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రముఖ వైద్య నిపుణులతో మార్చి 31 వ తేదీ వరకు మధుమేహ రోగులకు ఉచితంగా రెటీనా, గ్లూకోమ సంబంధించి కంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు ఎన్. ప్రవీణ కుమార్ , బి. రోహిణీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో గీతం వర్సిటీకి రజత పతకం



రన్నరప్‌గా నిలిచిన గీతం వర్సిటీ జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 25: ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో గీతం యూనివర్సిటీ రన్నరప్‌గా నిలిచి రజత పతకం సాధించింది. గుహవటిలో జరిగిన ఈ టోర్నీలో గీతం వర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన టి.సూర్యతేజ, కుశాల్ దాస్, రోహిత్ హల్దర్, ప్రణవ్‌కుమార్ రమేష్, ధ్రువ ఓజా అద్భుతంగా రాణించి రన్నరప్ ట్రోఫీని గెలిచి, జాతీయ స్థాయి పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ క్రీడాకారులతోపాటు కోచ్ ఆశిష్ పౌల్, టెక్నికల్ అఫిషియల్ డాక్టర్ డీవీఎస్‌వై.శర్మను గీతం యాజమాన్యం అభినందించింది.

న్యాయవాదుల దీక్షకు విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు

మహారాణిపేట, ఫిబ్రవరి 25: ఆంధ్రప్రదేశ్ భూ హక్కు యాజమాన్య చట్టం రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు ప్రకటించింది. ఆదివారం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పక్కి కొండబాబు, సభ్యులు అక్కడ దీక్ష శిబిరంలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పెట్ల బాల గంగాధర్ గోపి , న్యాయవాదుల సంఘం సభ్యులు పలకా శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

3న ఘంటసాల పాటల పోటీలు

సీతంపేట, ఫిబ్రవరి 25: అమర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతిని ఘంటసాల స్మారక పీఠం ఆధ్వర్యంలో మార్చి 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పీఠం ఉత్తరాంధ్ర వ్యవస్థాపకులు స్వరసమ్రాట్ డాక్టర్ టి.శరత్ చంద్ర తెలిపారు. ద్వారకానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. మార్చి 3, 4వ తేదీల్లో డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడియల్ గంధర్వ ఏపీ-2024 పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్రలో ఉన్న 9 నుంచి 80 ఏళ్ల వయసు గల గాయనీగాయకులను ఎంపిక చేస్తామన్నారు. అనంతరం గాయకుడు దాము గేదెలకు ఘంటసాల జీవన సాఫల్య పురస్కారం అందజేస్తామన్నారు. దాము గేదెల, మాధవిలక్ష్మి, పల్లి నాగభూషణ్ రావు, తెలుగు దండు సూరి తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వం

» 'ఉక్కు' పోరాట కమిటీ ప్రతిన » నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర » ప్రధానిపై పార్టీల నాయకులు ఒత్తిడి తేవాలని పలువురు నాయకులు పిలుపు



వడ్లపూడి, కణితిలలో పాదయాత్రలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 25 : ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానిచ్చేది లేదని ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. పోరాట కమిటీ ఆధ్వ ర్యంలో ఆదివారం ఉక్కు నిర్వాసిత కాలనీలైన వడ్లపూడి, కణితిలలో పాదయాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోది మార్చి ఒకటో తేదీన విశాఖ వస్తు న్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఈ విషయంలో ఆయనపై ఒత్తిడి తేవాలన్న లక్ష్యంతో ఈ పాదయాత్ర చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 27న కూర్మన్నపాలెం దీక్షా శిబిరం నుంచి జీవీఎంసీ దీక్షల శిబిరం వరకు పాదయాత్ర ఉంటుందని వివరించారు. ఉక్కు కర్మాగార పరిరక్షణకు ప్రాణత్యాగాలకైనా సిద్ధమేన్నారు. ఉక్కు పోరాట కమిటీ నాయకులు కేఎస్ఎన్ రావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ చిత్తశుద్ధితో ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ప్రయత్నిస్తుందో కార్మిక వర్గం వారికే మద్దతు పలుకుతుందన్నారు. మరో నాయకులు, కార్పొరేటర్ గంగారామ్, గంగవరం గోపి, వేముల పాటి ప్రసాద్ మాట్లాడుతూ బీజేపీకి కొమ్ము కాసిన అదానీ కార్మికుల జీవితాలతో ఆడుకోవాలని చూడడం సరికాదన్నారు. చిత్రాడ సన్యాసిరావు, వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్ మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోసం పాటుపడే నాయకులకు గుర్తింపు ఉంటుందన్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

అగనంపూడి : స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఆదివారం అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ఉక్కు పరిరక్షణ కమిటీ స్థానిక శాఖ ఆధ్వ ర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీడబ్ల్యూసీ పరిరక్షణ కమిటీ ప్రతినిధి జె.అయోధ్యరామ్ తొలుత ప్రారంభించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే హక్కు కేంద్రానికి లేదన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉక్కు నిర్వాసిత కాలనీల్లో మీదగా సాగిన ఈ ర్యాలీ ప్రధాన కూడలికి చేరుకొంది. కమిటీ నేతలు శీరంశెట్టి గోవిందరావు, అట్టా అప్పారావు, ఉరిటి మరిడయ్య, బొబ్బరి సూర్య, కరణం సత్యారావు, పెదిరెడ్ల నీలకంఠం, శీరంశెట్టి శ్రీను, వంకర రాము, మొల్లి కోటి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.


అగనంపూడి నిర్వాసిత కాలనీలో..


పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలో..

పెదగంట్యాడ: విశాఖస్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అఖిలపక్షాల కార్మిక సంఘాల నాయకులు ఆదివారం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర బాలచెరువురోడ్డు, సిద్ధేశ్వరం, దల్లివానిపాలెం తదితర గ్రామాల మీదుగా నడుపూరు జంక్షన్ వరకు కొనసాగింది. ఈసందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గొందేశి ప్రభాకరరెడ్డి, నాయకులు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు 1100 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అదానీ, అంబానీలకు ప్లాంట్ అప్పగించేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఎ.మసేన్‌రావు, నీరు కొండ రామచంద్రరావు, యు.రామస్వామి, పులి వెంకటరమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, గొందేశి మహేశ్వరరెడ్డి, డీవీ రమణరెడ్డి, మంత్రి శంకరనారాయణ, జెర్రిపోతుల ముత్యాలు, చెల్లుబోయిన నాయుడు, పెద్దాడ సోమునాయుడు, గొందేశి రాము, కోరుబిల్లి అప్పారావు, మద్ది అప్పలరాజు పాల్గొన్నారు.

ఉక్కు సమస్యలపై కేంద్ర బీఎంఎస్ అధ్యక్షుడికి వినతి



పాండ్యకు వినతిని అందిస్తున్న స్టీల్ బీఎంఎస్ నాయకులు

ఉక్కు టౌన్‌షిప్, ఫిబ్రవరి 25 : విశాఖకు విచ్చేసిన కేంద్ర బీఎంఎస్ అధ్యక్షుడు హిరణ్మయి పాండ్యను స్టీల్ బీఎంఎస్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు నేతృత్వంలో నాయకులు ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. సెయిల్‌లో విలీనం చేయాలని, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని, వేతన సవరణ చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అందులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామస్వామి, నాయుడు, రాందాస్ నరేంద్ర పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


విజేతలకు బహుమతులు అందిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, ఫిబ్రవరి 25 : క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఇక్కడి హైస్కూల్ మైదానంలో ఆదివారం క్రీడా భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. గూటూరు శంకరరావు, లక్ష్మీనారాయణ, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

3న కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ముత్యాలు

గాజువాక, ఫిబ్రవరి 25 : శ్రీకృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం ఆత్మీయ సమావేశం మార్చి మూడో తేదీన నిర్వహించనున్నామని సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు తెలిపారు. గాజువాకలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో అనివార్య కారణాల వలన వాయిదా పడిన సమావేశాన్ని ఇప్పుడు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.. తలారి వెంకటరమణ, అప్పారావు, నూకరాజు, చెల్లారావు, సూర్యారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'నీతి కథలతో నైతిక విలువలు'

పెదగంట్యాడ, ఫిబ్రవరి 25: నీతి కథల పఠనంతో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని స్థానిక శాఖాగ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. చదడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన విద్యార్థులతో నీతి కథలు చదివించారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీల్లోని పుస్తకాలు చదవడం వల్ల ఈ భాషలన్నీ అలవడతాయన్నారు. నడుపూరు హైస్కూల్, నెల్లిముక్కు యూపీ స్కూల్ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు.

రజకులు ఐక్యంగా ముందుకు సాగాలి : గోవిందరెడ్డి


బల్లల పండుగలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 25 : కుల వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న రజకులు తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని జీవీఎంసీ 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాం రజకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆది వారం తుంగ్లాం కాలనీలో నిర్వహించిన బల్లల పం డుగను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తోకాడ రాము, పట్నాల ప్రసాద్, ఎ.శ్రీను, పి.గణేష్, కె.రమ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో భాషపై పట్టు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 25 : విద్యార్థులు భాషపై పట్టు సాధించేందుకు పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని బీహెచ్‌పీవీ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయిని కె.నిర్మల అన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకుడు అలజంగి ఉదయ్ కుమార్ రచించిన టాపర్స్ అండ్ ర్యాంకర్స్ పుస్తకాన్ని ఆదివారం మింది ఐడియల్ స్కూల్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎ.రమ, ఎ.అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, ఫిబ్రవరి 25 : రాష్ట్రం ప్రగతి సాధించాలన్నా.. ప్రజల భవిష్యత్తు బాగుండాలన్నా.. చంద్రబాబువంటి సమర్థ నాయకుడు అవసరమని టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. దయాళ్‌నగర్‌లో ఆదివారం బాబు సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. అవినీతి, అక్రమాలు, కుట్రలతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్న వైసీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు దువ్వి శ్రీనివాస్, వియ్యపు కొండబాబు, కోన రాజు, కోనేటి శ్రీనివాసరావు, గండి కాశీ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ


కర పత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

అగనంపూడి, ఫిబ్రవరి 25 : జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక ఉమామహేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దానబోయిన అప్పలనాయుడు, కట్టా పైడిరాజు, గెద్దాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి మాఘమాస పూజలు



కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 25 : జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం సంపత్ వినాయక ఆలయంలో, చట్టివానిపాలెం సూర్యభగవానుడి ఆలయంలో మాఘమాసం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో అర్చనలు జరిపారు. నవగ్రహ హోమం చేశారు. శివాజీ శర్మ ఆధ్వర్యంలో ఆదిత్య హృదయాన్ని భక్తులు పఠించారు.

'ఏపీ జేఏసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం'

విశాఖపట్నం, ఫిబ్రవరి 25: ఉపాధ్యాయ, ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వం నుంచి సమస్యలపై ఎటువంటి స్పష్టత రాకుండా ఈనెల 27వతేదీన నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు విశాఖ జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరెండర్ లీవులు, పీఆర్సీ బకాయిలు, తదితర రూ.20వేల కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లింపులపై మినిట్స్ జారీ చేశారే తప్ప ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వక పోవడం శోచనీయమని పేర్కొన్నారు.

'బాలాజీనగర్ గృహ యజమానుల' కార్యవర్గం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 25: గంగవరం పోర్టు రోడ్డులోని బాలాజీనగర్ గృహయజమానుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడుగా యెల్లేటి శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా సీహెచ్ శంకర్, ఉపాధ్యక్షుడిగా స్వామినాయుడు, ప్రధానకార్యదర్శిగా కె. రమేష్, సహాయకార్యదర్శిగా టీజే పట్నాయిక్, కోశాధికారిగా ఎస్. సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా వీఎస్‌ఏ రాజ్‌కుమార్, ఆర్. శేషుకుమార్, వీ వెంకటేశ్వరరావు, ఎస్. అర్జున్‌బాబు, జె.రమణ ఎన్నికయ్యారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలపై ర్యాలీ

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 25 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలిథిన్ కవర్ల వల్ల అనర్థాలపై జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి చేపలు, మాంసం మార్కెట్‌లో తిరుమల నగర్‌లో కాలనీవాసులు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేపలు, మాంసం కోసం వచ్చేవారు స్టీల్ బాక్సులు తీసుకు వెళ్లాలని, మార్కెట్‌లకు గుడ్డ సంచులను వినియోగించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పరమానందం, నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, మూర్తి పాల్గొన్నారు.

కోరమాండల్ సామాజిక సేవలకు ప్రణాళిక

మల్కాపురం, ఫిబ్రవరి 25 : కోరమాండల్ ఎరువుల కర్మాగారం సామాజిక సేవ కార్యక్రమాలకు ప్రణాళికలను సిద్ధం చేసిందని సంస్థ యజమాన్యం ప్రకటించింది. . ఈ సంస్థ అందిస్తున్న సేవ కార్యక్రమాలపై యజమాన్యం ఓ ప్రతిక ప్రకటనను ఆది వారం విడుదల చేసింది. దేశంలో వ్యవసాయ రంగంలో విశ్వసనీయమైన పేరును పొందిన ఈసంస్థ అదే స్థాయిలో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొంది. రూ.10 కు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకం ఓ ఆస్పత్రిని ప్రారంభించినట్లు తెలిపింది. ఆస్పత్రి ద్వారా గత ఏడాది 28, 160 మంది రోగులకు వైద్య సేవలు అందించడం జరిగిందని తెలిపారు. కొంతమందికి ఆర్థోపెడిక్స్ , పీడియాట్రిక్స్, పల్మనాలజీ, డెర్మటాలజీ సేవలు పొందారని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధికి శిక్షణ అందిస్తున్నట్టు తెలిపింది.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడీ, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (న లుపు) 24, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 22, క్యారెట్ 22, దొండకాయలు 36, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 210, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28 , కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

పంచ గ్రామాల సమస్య పరిష్కరించాలి

వేపగుంట ఫిబ్రవరి 25: వేపగుంట పరిసర ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉన్న దేవస్థాన, ఉడా భూముల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్రజా రైతు సంక్షేమ సేవా సంఘం, స్థానిక యువకులు, గ్రామపెద్దలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. వేపగుంట ఆంజనేయ స్వామి గుడి నుంచి ప్రారంభమయిన ఈర్యాలీ వేపగుంట కూడలివరకు సాగింది. జంక్షన్‌లో మానవహారానికి ప్రయత్నించారు. దీంతో ఏసీపీ నర్సింహమూర్తి, ట్రాఫిక్ పోలీసులు ప్రస్తుతం గ్రూప్- 2 పరీక్షలు జరుగుతున్నందున ట్రాఫిక్ అంతరాయం నెలకొంటుందని వివరించారు. అలాగే, 144 సెక్షన్ అమల్లో ఉందని అనుమతులు లేవని స్పష్టంచేశారు. దీంతో కొద్దిసేపు పోలీసులు, ఆందోళన చేస్తున్న వారి మధ్యవాగ్వాదం నెలకొంది. అనంతరం డివైడర్‌పై ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసన చేపట్టారు. 1903 గిల్‌మెన్ సర్వే ప్రకారం దేవస్థాన సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో రైతు సంక్షేమ కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, వేపగుంటకుచెందిన సురేశ్, సంజీవ్, అప్పలరాజు, శివ, శ్రీను, ప్రతాప్, ప్రసాద్, శంకరరావు, పార్టీలకతీతంగా యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బీఆర్‌టీఎస్ డివైడర్‌పై బాధితుల నిరసన

ఎస్సీల భూములు మరొకరికి ఎలా కేటాయిస్తారు..?

» అధికారుల తీరుపై ఎస్సీ కమిషన్ చెర్మన్ మండిపాటు

» ఆర్డీవో, ఏసీపీలకు సమన్లు జారీ చేయాలని ఆదేశం


బాధితులతో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చెర్మన్ విక్టర్‌బాబు

అగనంపూడి, ఫిబ్రవరి 25 : అగనంపూడి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 56/1, 2లో భూములను ఆదివారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చెర్మన్ విక్టర్ ప్రసాద్ పరిశీలించారు. ఇటీవల ఈ భూముల విషయమై తమకు అన్యాయం జరిగిందని ఎస్సీ వర్గాలు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సదరు భూములను సందర్శించి ఇందుకు సంబంధించిన వివరాలను బాధితుల ద్వారా తెలుసుకున్నారు. 1975లో ఈ భూములు ప్రభుత్వం తమకు కేటాయిందని చెప్పారు. ఇటీవల స్టీల్ ప్లాంట్ అధికారులు బలవంతంగా తన నుంచి స్వాధీనం చేసుకొని కర్ణవానిపాలెం నిర్వాసితులకు కేటాయించినట్లు వివరించారు. దీనిపై స్పందించిన చైర్మన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీలకు కేటాయించిన భూములను ప్రభుత్వ స్వాధీనం చేసుకుంటే, తిరిగి ఎస్సీలకే కేటాయించాలన్నారు. రెవెన్యూ, స్టీల్‌ప్లాంట్ అధికారులు ఏవిధంగా కర్ణవానిపాలెం నిర్వాసితులకు కేటాయిస్తారని ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ స్థలాల్లో ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టడానికి వీల్లేదన్నారు. ఈ భూముల కేటాయింపు వ్యవహారంలో విశాఖపట్నం ఆర్డీవో, సౌత్ ఏసీపీలకు సమన్లు జారీ చేయాలని ఎస్సీ కమిషన్ అధికారులకు చైర్మన్ ఫోన్‌లో ఆదేశించారు. ఈ భూములకు సంబంధించిన రికార్డులతో తమముందు హాజరు కావాలన్నారు. ఆయన వెంట గాజువాక తహసీల్దార్ శ్రీవల్లీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బాలలే దేశ సంపద


విద్యార్థికి పుస్తకం అందజేస్తున్న అధ్యాపక బృందం

మల్కాపురం, ఫిబ్రవరి 25: బాలలు ఆరోగ్యంగా, ఆ నందంగా ఉండడంపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఆదారపడి ఉంటుందని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. కళాశాల బృందం తాటిచెట్లపాలెం, కంచరపాలెంలలోని మురికివాడల ప్రాంతాల్లో పర్యటించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నారుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు. హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ఎన్నికలో ఏవరెన్ని ఓట్లు సాధించారు.

శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, ఆనంద్ కుమార్ తదితరులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 25: స్థానిక పద్మనాభనగర్‌లో నిర్మిస్తున్న కాపు కల్యాణ మంటపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ దేవరాయులు, వంగవీటి మోహనరంగ విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వార్డు వైసీపీ నేతలు, తెలుగ, బలిజ, కాపు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ -2 పరీక్షలు

ఎన్.ఎ.డీ జంక్షన్/ వేపగుంట ఫిబ్రవరి 25: గ్రూపు 2 పరీక్షలు బుచ్చిరాజుపాలెం, ఆర్.ఆర్.వి.పురం ఆళ్లార్ కళాశాలల్లో ప్రశాంతంగా పూర్తయ్యాయి. పరీక్షకు అరగంట ముందుగానే కేంద్రాలకు అభ్యర్థులు చేరుకున్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ప్రవేశానికి డబుల్ రోడ్డులోని వెనుకు మార్గంను అనుమతించారు. పరీక్ష పూర్తయిన తరువాత బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్‌రోడ్డు మార్గంలో వెళ్లే స్కూల్ యాజమాన్యం చర్యలు చేపట్టింది. దీంతో బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో మధ్యాహ్నం 1.30 సమయంలో కొంత ట్రాఫిక్‌కు అంతరాయం ఏ ర్పడింది. పరీక్ష కొంత కఠినంగా ఉందని అభ్యర్థులు పేర్కొన్నారు.

మల్కాపురం: మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల, గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న ఆండళమ్మ కాలేజీలో సుమారుగా 500 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లే ప్రతి విద్యార్థిని క్షుణంగా తనిఖీ చేసి లోనికి పంపించారు.

పెందుర్తి: పెందుర్తి పరిధిలో ఏడు కేంద్రాల్లో నిర్వహించిన ఈపరీక్షలో సుమారు రెండు వేల మంది అభ్యర్థులు పరీక్ష హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు, కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.


గోపాలపట్నంలోని ఆదిత్య కళాశాల పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

గోపాలపట్నం: గోపాలపట్నంలోని ఆదిత్యా డిగ్రీ కళాశాల, బాలజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సుమారు 800 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కేంద్రాలను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు.

హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఎన్నికలు


ఎన్నికలో గెలుపొందిన ప్రతినిధులు

మల్కాపురం, ఫిబ్రవరి 25 : హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కాంట్రాక్ట్ అసోసియేషన్ ఎన్నిక ఆదివారం పిలకవాని పాలెంకు వెళ్లే మార్గంలోఉన్న వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. మొత్తం 272 ఓట్లకు గాను 202 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా పోటీచేసిన మజ్జి సోమేశ్‌కు 153 ఓట్లు రాగా, ఆయనకు ప్రత్యర్థిగా పోటీచేసిన అనర్‌బాబు 45 ఓ ట్లను సాధించారు. అసోసియేషన్ కార్యదర్శిగా రవిశంకర్ దయానంద్, సహాయ కార్యదర్శిగా భోగవిల్లి కరుణకర్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, కోశాధికారిగా సత్యాల రవికుమార్ గెలుపొందారు. ఈసందర్భంగా హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మజ్జి సోమేశ్ మాట్లాడుతూ.. తనను రెండోసారి అధ్యక్షుడిగా గెలిపించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టర్లకు, కార్మికులకు మేలు జరిగే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్మికులు విజేతలను అభినందించారు.

బుచ్చెయ్యపేట వైసీపీలో ముదిరిన వర్గపోరు

» విశాఖ డెయిరీలో ఇరువర్గాలతో మంత్రి, చైర్మన్ సమావేశం

» ధర్మశ్రీ వ్యతిరేక వర్గంపై అనుకూల వర్గం దాడి?

» పోలీసుల జోక్యంతో సర్దుబాటు

చోడవరం/ అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 25 : చోడవరం నియోజకవర్గం పరిధిలోని బుచ్చెయ్యపేట వైసీపీ మండల అధ్యక్షుడిని మార్చడంపై ఆదివారం విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఆ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం రసాభాసగా మారింది. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వ్యతిరేకంగా ఆరోపణలు చేసిన వైసీపీ మండల మాజీ అధ్యక్షుడితోపాటు అదే మండలానికి చెందిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తదితరులు ఈ సమావేశానికి హాజరైనట్టు తెలిసింది. ఈ సందర్భంగా మంత్రి అమర్, డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌ల సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా ధర్మశ్రీ వర్గానికి చెందిన దొండా రాంబాబు వర్గీయులు దాడికి ప్రయత్నించినట్టు సమాచారం. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు డెయిరీకి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడి నుంచి పంపివేశారు. బుచ్చెయ్యపేట మండలానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు రెండు రోజుల క్రితం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, వచ్చే ఎన్నికల్లో ధర్మశ్రీకి టికెట్ ఇస్తే వైసీపీ ఓడిపోతుందని చెప్పారు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని సమన్వయకర్తగా నియమించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ధర్మశ్రీ, అతని సోదరుల అవినీతి చర్యల వల్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారంటూ కొంతమంది నాయకులు సీఎంకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు అసంతృప్తి వాదులను చల్లబరిచేందుకు విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు సమాచారం.

రక్తదానంతో ప్రాణదానం


శిబిరంలో పాల్గొన్న జనసేన నేత తమ్మిరెడ్డి శివశంకర్

పెందుర్తి, ఫిబ్రవరి 25: రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన పార్టీ రాష్ట్ర నేత తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. సుజాతనగర్‌లోని సత్యసాయి భజన భక్తబృందం ఆధ్వర్యంలో స్థానిక ఆనందసాయి మందిరంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శిబిరంలో 41 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. విక్టోరియా బ్లడ్ బ్యాంకు వైద్యులు దాతలనుంచి రక్త సేకరణ చేశారు. కార్పొరేటర్ మ్ముమ్మన దేవుడు, సత్యసాయి భక్తబృందం గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, ప్రతినిధులు ముక్క గోపి, జ్యోతిర్మయి, బుజ్జిబాబు, తాతారావు, సీతారామయ్య పాల్గొన్నారు.

ఘనంగా మాఘమాస వేడుకలు



లీలామాధవస్వామి ఆలయం వద్ద జన సందోహం

మురళీనగర్, ఫిబ్రవరి 25; మాఘమాసం వేడుకలు ఆదివారం మాధవధారలోని శ్రీ లీలామాధవస్వామి పుణ్యక్షేత్రంలో వైభవంగా జరిగాయి. ఉదయం జలధార వద్ద పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, వేణుగోపాల స్వామి, లీలా మాధవస్వామి మందిరాలను దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. సహజసిద్ధ జల ధారల వద్ద రద్దీ వాటర్ ట్యాంకుల ద్వారా పైపులైన్లను అమర్చి స్నానాలకు ప్రత్యేక షవర్‌లను ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీ లీలామాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల తర్వాత దాత సాయంతో 2 వేల మందికి అన్నదానం చేశారు.

పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి

సీతమ్మధార, ఫిబ్రవరి 25: జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా పిల్లలను తీర్చిదిద్దాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్ పేర్కొన్నారు. బుల్లయ్య కళాశాల్లో గాంధీ సెంటర్‌లో విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో 'పిల్లల విద్యలో రావాల్సిన మార్పులు' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కులు, ర్యాంకులంటూ పిల్లలపై ఒత్తిడి పెంచడం తగదన్నారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచాలన్నారు. గాంధీ సెంటర్ అధ్యక్షులు, నాగార్జున యూనివర్శిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ, పిల్లలో అనేక మేధోపరమైన ప్రత్యేకతలుంటాయన్నారు. వాటిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ అధ్యక్షులు నరవ ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్కు కమిటీ ప్రమాణ స్వీకారం

మాధవధార, ఫిబ్రవరి 25; పార్కుల్లో కాలనీవాసులందరికీ సమ ప్రాధాన్యం ఉంటుందని మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కు అసోసియేషన్ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పార్కు (స్కేటింగ్ పార్కు)లో 2024 నుంచి 2026 వరకు ఎన్నికైన కొత్త కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలనీ వాసులందరికీ పార్కుల్లో ఉచిత ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మహిళల నుంచి, యువత, పిల్లల్లో క్రీడల్లో పాల్గొనే చూస్తామన్నారు. అనంతరం పార్కు పాత కమిటీ సభ్యులను సత్కరించారు. అధ్యక్షుడిగా సనపల.వరప్రసాద్, కార్యదర్శి పి.వి.ఎస్.రాజు, ఉపాధ్యక్షునిగా పల్లా.చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసారు. కాలనీ వాసులు, పార్కు శాశ్వత కమిటీ సభ్యులు, యువత, మహిళలు కార్యక్రమంలో ఉన్నారు.

నృసింహ యజ్ఞానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న దేవస్థానం చైర్మన్ అశోక్ గజపతిరాజు

సింహాచలం, ఫిబ్రవరి 25 : లోకకల్యాణార్థం సింహాచలంలో ఫాల్గుణమాస బహుళ పక్ష విదియ నుంచి చతుర్వేద హవన పూర్వక పాంచాహ్నిక పంచకుండాత్మక యజ్ఞం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం సంప్రదాయ రీతిలో భూమి పూజ చేశారు. స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో వాస్తుపురుష పూజ, భూమి పూజ చేశారు. అనంతరం హలానికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు సతీసమేతంగా కర్షణానికి (దున్నేందుకు) లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ యజ్ఞం నిర్వహణకు దాతల సహకారంతో మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. యజ్ఞంలో పాల్గొనేందుకు విధి విధానాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. కాగా అంతకుముందు అశోక్ దంపతులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు అశోక్‌కు శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. ఈవో ప్రసాదాలను అందజేశారు. పూజలో పాలకమండలి సభ్యులు ఈఈ డీజీ శ్రీనివాసరాజు, ఏఈఓ పి.నరసింగరావు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ మేయర్'

» జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబరు 18004250009

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఎవరికైనా పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ యూసీడీతోపాటు హార్టికల్చర్ విభాగాలకు సంబంధించి సమస్యలు ఉంటే సోమవారం ఉదయం పది నుంచి 11 గంటల మధ్య టోల్‌ఫ్రీ నంబరు 18004250009కి ఫోన్ చేయాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఫోన్‌కాల్స్‌ను స్వయంగా తానే స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి గ్రీవెన్స్ తీసుకుంటామన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఆకట్టుకున్న మియావాకి స్టోరీ టైమ్

సీతంపేట, ఫిబ్రవరి 25: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో లైబ్రరీ సొసైటీ, భారతీయ విద్యా భావన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మియావాకి స్టోరీ టైమ్ కార్యక్రమం ఆకట్టుకుంది. కమిషిబాయి అని పిలవబడే సంప్రదాయ జపనీస్ కథ చెప్పే పద్ధతిలో కథా విధానంపై చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. బెంగళూరులోని కథాలయ ఫౌండేషన్‌కు చెందిన సర్టిఫైడ్ కథకురాలు వరలక్ష్మి కమిషిబాయి.. చెక్క వేదికగా, చిత్రపటాలను ఉపయోగించి ఓ భారతీయ జానపద కథను పిల్లలకు వినిపించారు.

'టీడీపీ,జనసేనతోనే సుస్థిర పాలన '

కంచరపాలెం, ఫిబ్రవరి 25: సుస్థిర పాలన కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించాలని జనసేన ఉత్తర వైసీపీ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ కోరారు. జీవీఎంసీ 48వ వార్డులో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషాకిరణ్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో ప్రజలు అష్టకష్టాలను పడుతున్నారన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొండవాలు ప్రజలకు ప్రమాదాల జరగకుండా రిటర్నింగ్ వాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వార్డు అధ్యక్షుడు ఉప్పులూరి శ్రావణ్, చిక్కాల గీత, పాల్గొన్నారు.

చంద్రబాబుతో గంటా, బాబ్జీ భేటీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడును ఉండవిల్లిలో ఆయన నివాసం లో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆదివారం కలుసుకున్నారు. తూర్పు, పశ్చిమ సీట్లు ఖరారుచేసిన నేపథ్యంలో అధినేత నుంచి వీరికి పిలుపువచ్చింది. నేతలిద్దరూ వేర్వేరుగా బాబుతో సమావేశమయ్యారు. పార్టీ వర్గాలు, నేతలు తెలిపిన వివరాల మేరకు... గంటా శ్రీనివాసరావును విజయ నగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని అధినేత సూచించారు. పార్టీ నిర్వ హించిన సర్వే అనుకూలంగా వచ్చిందని పేర్కొం టూ...ఎక్కడ నుంచైనా గెలిచే సత్తా ఉందని సూచించారు. దీనికి గంటా భీమిలి నుంచి పోటీచేస్తానని తెలిపారు. విశాఖప ట్నంలోనే స్థిరపడ్డానని, భీమిలి కాకపోతే జిల్లాలోని మరో చోట నుంచి పోటీకి అవకా శం ఇవ్వాలని గంటా కోరగా బొత్స మరో స్థానంలో పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోందని, అదే జరిగితే భీమిలి టిక్కెట్ పరిశీలిస్తానని గంటాకు సూచించారు. అనంతరం దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ, అతని కుమా రుడు వంశీ చంద్రబాబుతో సమా వేశమ య్యారు. దక్షిణ టికెట్ జనసేన కోరు తున్న విషయాన్ని చంద్రబాబు ప్రస్తావిం చారు. దీనికి బాబ్జీ వివరణ ఇస్తూ అధిష్ఠానం ఆదేశాల మేరకు పెందుర్తి నుంచి వచ్చి రెండేళ్లుగా కష్టపడి పనిచేసి కేడర్‌ను సమాయత్తం చేశానన్నారు. దీంతో ప్రస్తుతం నియోజక వర్గాన్ని వదలొద్దని, కష్టపడి పనిచేయాలని చంద్రబాబు ఆయనకు భరోసా ఇచ్చారు. దీంతో తనకు టికెట్ లభిస్తుందనే నమ్మకం కుదిరిందన్నారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గండి బాబ్జీ

సుప్రీంకోర్టు న్యాయమూర్తికి సన్మానం



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహతో న్యాయవాదులు

విశాఖపట్నం(లీగల్), ఫిబ్రవరి 25: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీనరసింహను విశాఖ న్యాయవాదుల సంఘం ఆదివారం సన్మానించింది. విజయనగరంలో కోర్టుల భవన సముదాయా నిర్మాణ శంకుస్థాపనలో భాగంగా నగరానికి వచ్చిన న్యాయమూర్తి విశాఖ జిల్లా కోర్టుల లైబ్రరీలో సంఘం సన్మానించింది. అనంతరం న్యాయవాదుల పలుసమస్యలను వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తు యు. దుర్గాప్రసాద్, ఇతర న్యాయమూర్తులు బార్ అసోసియేషన్ కార్యాలయానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షులు లత, కార్యదర్శి పైలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

బౌద్ధ ధర్మంలో అసమానతలు దూరం

» 11వ బౌద్ధ మహా సమ్మేళనంలో వక్తలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట, ఫిబ్రవరి 25: బౌద్ధ ధర్మంతో అసమానతలు దూరం చేయవచ్చని పలువురు బౌద్ధ మేధావులు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 11వ బౌద్ధ మహా సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బౌద్ధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డాక్టర్ ఆయుపాల మహాతెరో, సారిపుత్ర ధర్మ ప్రబోధన చేశారు. వీసీకే అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ప్రముఖ వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, బాంసెఫ్ జాతీయ నాయకులు నల్లా గంగాధర్, బౌద్ధ రచయిత డి. నటరాజ్ సాఖ్య, అంబేడ్కర్ మెమోరియాల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, సొసైటీ రాష్ట్ర కార్యదర్శి వీవీ దుర్గారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వేణుగోపాల్ గౌతమ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వయ్యల సిద్ధార్థలు బౌద్ధంపై పలు అంశాలను ప్రసంగించారు.సావనీర్‌ను ఆవిష్కరించారు.

ఉద్యమాల్లో జయగోపాల్ కృషి మరవలేం

» సంస్మరణ సభలో సీపీఐ నేత సత్యనారాయణ మూర్తి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 25: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉద్యమాల్లో సామాజిక, హేతువాద ఉద్యమకారుడు జయగోపాల్ ప్రభావం ఎంతో ఉందని, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారని సీపీఐ రాష్ట్ర నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం డా.జయగోపాల్ సంస్మరణ సభను భారత నాస్తిక సమాజం , సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునాట జయగోపాల్ తన కుటుంబ సభ్యులందరినీ తనతో ఉద్యమంలో తీసుకువెళ్లారన్నారు. ద్రవిడ కజగం నేత వీరమణి కుమారుడు వి.అంబురాజు మాట్లాడుతూ జయగోపాల్ సాంస్కృతిక సాంఘిక విప్లవకారుడని, యువతకు ఆయన ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. తమిళనాడులో కూడా ఆయన ఆనాడు పెరియర్‌తో కలిసి పని చేశారని గుర్తుచేశారు .విశాఖలోని బీచ్‌రోడ్డులో పెరియార్ విగ్రహం ఏర్పాటుకు జయగోపాల్ కృషి మరవలేనిదన్నారు.మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సీనియర్ పాత్రికేయులు వీవీ రమణమూర్తి జయగోపాల్‌పై మాట్లాడారు. భానాస రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ థామ్సస్ స్ట్రీట్‌లో కోపరేటివ్ స్టోర్ నుంచి 1971లో జయగోపాల్‌తో తన ప్రస్థానం ప్రారంభించారన్నారు.మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ, పాల్తేటి పెంటారావు, లలిత, గంట మోహన్‌రావు, సాయినరేందర్, జె రవి, ఎంవీఆర్ కృష్ణశరత్, పి.అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



జయగోపాల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వక్తలు

మేజర్ పోర్ట్సు కబడ్డీ విజేత చెన్నై



చెన్నై పోర్టు జట్టుకు ట్రోఫీ అందిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 26: విశాఖపట్నం పోర్టు స్పోర్ట్సు కౌన్సిల్ నిర్వహించిన 39వ అఖిల భారత మేజర్ పోర్ట్సు కబడ్డీ టోర్నీలో చెన్నై పోర్టు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ట్యుటికోరిన్ పోర్టు రన్నరప్‌గా నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై పోర్టు తృతీయస్థానాన్ని దక్కించుకున్నది. పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో చెన్నై పోర్టు 53-48 స్కోరు తేడాతో ట్యుటికోరిన్ పోర్టుపై విజయం సాధించింది. చెన్నై పోర్టులో స్టువర్ట్ సింగ్ 20, కామేశ్వరన్ 15, దినేశ్‌కుమార్ పది పాయింట్లు సాధించగా, ట్యుటికోరిన్ జట్టులో ఎన్.భరత్ 20, ఎం.వెలన్ 14, మణికందన్ ఎనిమిది పాయింట్లు సాధించాడు. టోర్నీ బెస్ట్ రైడర్‌గా ఎన్.భరత్ (ట్యుటికోరిన్), బెస్ట్ డిఫెండర్‌గా సౌరభ్ రౌత్ (ముంబై), బెస్ట్ ఆల్ రౌండర్‌గా దినేశ్‌కుమార్ (చెన్నై) అవార్డులందుకున్నారు. టోర్నీ ముగింపునకు విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్మన్ డి.దుర్గేశ్ కుమార్ దుబే విజేతలకు ట్రోఫీలు, బహుమతులందజేశారు.

అబ్బురపరిచిన సీ ఫేజ్ విన్యాసాలు

» నౌకదళ శక్తి సామర్థ్యాలను తెలియజేసేలా నిర్వహణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):మిలాన్-2024లో భాగంగా సముద్రంలో ఆదివారం విన్యాసాలు కొనసాగాయి. ఈ విన్యాసాల్లో భారత్‌తో పాటు మిత్రదేశాలకు చెందిన నేవీ భాగస్వామ్యమ య్యాయి. ఆయా దేశాలకు చెందిన నౌకలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు విన్యాసాల్లో పాల్గొన్నాయి. నౌకాదళ శక్తి, సామర్థ్యాలను తెలియజేసేలా సాగాయి. ఉపరితలంలోనే లక్ష్యాలను చేధించడం, వైమానిక లక్ష్యాలకు వ్యతిరేకంగా ఆయుధ కాల్పులు, జలాంతర్గాముల లక్ష్యాలను తిప్పికొట్టే రీతిలో సాగించిన విన్యాసాలు నేవీ సామర్థ్యాన్నితెలియజేశాయి. భారత్‌తోపాటు మిత్ర దేశాల ఆధ్వర్యంలో సముద్రంలో సాగిస్తున్న విన్యాసాలతో ఒకరకంగా యుద్ధ వాతావరణం కనిపించింది. సముద్ర సామర్థ్యాలను, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించుకునేందుకు అనుగుణంగా విన్యాసాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 27 వరకు రెండో విడత సీ ఫేజ్ విన్యాసాలు కొనసాగనున్నాయి.



హెలీకాప్టర్ విన్యాసం

'టీడీపీ, జనసేనల అభ్యర్థుల ప్రకటనతో వైసీపీ షాక్'

సీతంపేట, ఫిబ్రవరి 25: అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా టీడీపీ, జనసేన పార్టీలు ప్రకటించిన ఎన్నికల అభ్యర్థుల జాబితాలతో వైసీపీనేతలు షాక్ తిన్నారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన పార్టీలు ప్రజా సమక్షంలో 99 సీట్లు ప్రకటించారని, దీని చూసి వైసీపీ చీఫ్ జగన్ చీప్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. వైసీపీలో సమన్వయకర్తలు అభ్యర్థులు కాదా అని ప్రశ్నించారు.

నిజంగా దమ్ము ఉంటే నేరుగా అసెంబ్లీ అభ్యర్థి అని ప్రకటించాలని, అది మానేసి నియోజకవర్గానికి సమన్వయకర్త అంటున్నారని ఎద్దేవా చేశారు. ఈస్థితిలో ఆ పార్టీలో గల కోడి గుడ్డు మంత్రి అమర్ ఏదేదో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అమర్ ముందు నీ సీట్ ఎక్కడో చెప్పాలన్నారు. ఆ పార్టీకి తీరు తెన్నులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పెంచుతున్న ప్రభుత్వాలు

» ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం దావలే

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 25: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్నాయని, ఈ స్థితిలో ఆహార భద్రత, పట్టణ ఉపాధి హామీపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఐద్వా కేంద్ర కమిటీ సమావేశాలు ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. సమావేశాల్లో మహిళల సమస్యలపై చర్చించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో మహిళల జీవితాల్లో సంక్షోభం నెలకొంటోందన్నారు. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలనే దానిపై చర్చించాల్సి ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగాలను నాశనం చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా చాలా మందికి పనిలేదు, ఆహారం, చదువు, ఆరోగ్యం లేదన్నారు. ఇటువంటి ప్రభుత్వాలను ఓడించకుంటే సాధారణ ప్రజలు నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో ఆలిండియా అధ్యక్షులు పీకే శ్రీమతి, కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మరియం దావలే

అధ్వాన రహదారులను పట్టించుకోరా?

» సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 25: పాతనగరంలోని రామకృష్ణా జంక్షన్ రైతుబజారు రోడ్డు అధ్వాన స్థితిపై సీపీఎం నాయకుడు సుబ్బారావు ఆధ్వర్యంలో పలు సంఘాల కార్మికులు ఆందోళన నిర్వహించారు. పాతనగరంలోని రహదారులను తక్షణం అభివృద్ధి చేయాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రామకృష్ణా జంక్షన్‌నుంచి కాన్వెంట్ జంక్షన్ వరకు మార్గం పూర్తి గతుకుల మయంకావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. పూర్ణామార్కెట్‌కు కూరగాయల రవాణా చేసే వాహనదారులు నిత్యం నరక యాతన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రామకృష్ణా జంక్షన్ రైతు బజారు వద్ద ప్రధాన రోడ్డు మార్గంను జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. పోర్టు మార్గం వైపు కొద్ది రోజుల క్రితం బైక్‌పైన వెళ్తున్న గర్భిణి గోతుల్లో పడి ప్రమాదానికి గురైనట్టు చెప్పారు. పాతనగరంలోని ప్రధాన రహదారులన్నీ పాడయ్యాయన్నారు. నిత్యం జనాలు అవస్థలు ఎదుర్కొ. కార్య క్రమంలో రిక్షా పుల్లర్స్ యూనియన్ నాయకులు కె.నాగరాజు, నరసింగరావు, అయ్యన్న, మోటారు మెకానిక్ యూనియన్ నాయకులు కె.గణేశ్, సీఐటీయూ నాయకులు చంద్రమౌళి, ఎర్రిబాబు , కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ రామకృష్ణా జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి నియోజకవర్గంలో అసమ్మతిపోరు ఎక్కువైంది. పార్టీలోని కొంతమంది నేతలు, కార్యకర్తలు ధర్మశ్రీకి టికెట్ ఇవ్వొద్దంటూ మీడియా సమావేశాలు పెట్టి మరీ స్పష్టం చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ఎమ్మెల్యేగా శెట్టి ఫాల్గుణ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ నియోజకవర్గం సమన్వయకర్తగా ఎంపీ గొడ్డేటి మాధవిని నియమించారు. దీనిపై మండల స్థాయి నేతలు, కార్యకర్తల నుంచి వ్యతిరేకత రావడంతో పార్టీ పెద్దలు ఆమె (మాధవి) స్థానంలో హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగాన మత్సలింగంని నియమించారు. పాడేరు ఎమ్మెల్యేగా కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఉండగా.. నియోజకవర్గ సమన్వయకర్తగా మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమించారు.

వైవీ వ్యాఖ్యలతో కలకలం

ఇదిలావుండగా కొత్తగా సమన్వయకర్తలుగా నియమితులైన వారికి, సిట్టింగ్ ఎమ్మెల్యేలే సమన్వయకర్తలుగా ఉన్న వారికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమనే భావన కార్యకర్తల్లో ఉంది. వారంతా తమ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తామే అభ్యర్థులమనే నమ్మకంతో ఎన్నికల ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఈ తరుణంలో శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలను కలవరపాటుకి గురిచేశాయి. అంతేకాకుండా ప్రస్తుత ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలపై అసమ్మతి వున్న నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉంటుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. దీంతో టికెట్ ఎవరికి వస్తుందో తెలియక నేతలు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. మరోవైపు టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతుండగా... అభ్యర్థులు ఎవరన్న దానిపై స్పష్టత లేక వైసీపీ శ్రేణులు నిరుత్సాహంలో కూరుకుపోయాయి.

గ్రూప్-2 అభ్యర్థులకు చుక్కలు

... 5వ పేజీ తరువాయి

రాసిన అభ్యర్థులకు అక్కడ నిర్వాహకులు పలు ఆంక్షలు విధించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు తమతో పాటు తీసుకువచ్చిన బ్యాగులను లోనికి అను మతించలేదు. దీంతో కళాశాలకు ఎదురుగా ఉన్న టీ దుకాణంలో పెట్టుకోవాలని పోలీసులు సూచిం చారు. పరీక్ష రాసిన తరువాత వచ్చిన అభ్యర్థుల నుంచి టీ దుకాణం యజమాని ఒక్కో బ్యాగుకు రూ.30 చొప్పున వసూలు చేశారు. అంతేకాకుండా బ్యాగులు తిరిగి ఇచ్చే సమయంలో గందరగోళం నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్వాకంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని పలువురు ఆరోపించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు రాసిన అభ్యర్థులకు కనీసం తాగునీటి సదుపాయం కల్పించలేదు. అభ్యర్థులు పదేపదే కోరితే ఇన్విజిలేటర్లు తాము తెచ్చుకున్న వాటర్ బాటిల్స్‌ను అభ్యర్థులకు ఇచ్చారు. ఇదిలావుండగా విశాఖ జిల్లాలో మొత్తం 105 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, 47,491 మందికి అభ్యర్థులకు గాను 39,300 (82.75 శాతం) మంది హాజరయ్యారు. అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం కేంద్రాల్లో 10,627 మంది అభ్యర్థులకుగాను 9,060 మంది (85.25 శాతం) పరీక్షకు హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, జేసీ

విశాఖలో ఆదివారం గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష (స్క్రీనింగ్ టెస్ట్) నిర్వహించిన కొన్ని కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సందర్శించారు. వుడా పార్కు ఎదురుగా ఎంఎల్‌బీటీ స్కూలులో ఏర్పాటు చేసిఇన కేంద్రాన్ని తనిఖీచేసి అభ్యర్థుల సంతకాల రిజిస్టర్ పరిశీలించారు. రోల్ నంబరు ప్రకారం సీటింగ్ అరేంజ్‌మెంట్స్ తనిఖీ చేశారు. వారి వెంట కేంద్రం డిపార్టుమెంటల్ అధికారి, కనకమహాలక్ష్మి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ ఉన్నారు.

ఉన్నవాటికే వసతుల్లేవ్!

... 5వ పేజీ తరువాయి

ఉన్నత పాఠశాలల్లోని గదుల్లో కొన్నింటిని హైస్కూలు ప్లస్‌కు కేటాయించారు. ఇక్కడ చదువుకునే సైన్స్ విద్యార్థులకు ఇంత వరకు ల్యాబొరేటరీ సదుపాయం లేదు.

ప్రస్తుతం ద్వితీయ ఇంటర్‌లోకి వచ్చిన సైన్స్ విద్యార్థులు సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలల ల్యాబొరేటరీల్లో తరగతులకు హాజరయ్యారు. ఇందుకోసం ప్రతి విద్యార్థి కొంత మొత్తం వెచ్చించాల్సి వచ్చింది. సాధారణంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు అదే ఏడాది నుంచి ల్యాబొరేటరీ అందుబాటులో ఉండాలి. కానీ హైస్కూలు ప్లస్‌లోచేరిన విద్యార్థులకు గత ఏడాది ఈ సౌకర్యం లేదు. అంతేకాదు హైస్కూలు ప్లస్‌లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం, షూస్, బ్యాగులు, నోట్‌బుక్స్ ఇవ్వరు. మధ్యాహ్న భోజనం కూడా ఉండదు. సాధారణంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హైస్కూలు ప్లస్‌లో చేరిన వారిలో ఎక్కువమంది పేద వర్గాలకు చెందిన విద్యార్థులే ఉంటారు. అయినప్పటికీ ప్రభుత్వపరంగా ఎటువంటి సదుపాయాలు అందడంలేదు. పైగా ఇక్కడ తరగతులు బోధించే పీజీటీలకు గత ఏడాది జూన్ నుంచి ఇంతవరకు ఇంక్రిమెంట్లు అందలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా మూడు ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఉన్న వాటికే దిక్కులేదు... కొత్తగా మరిన్ని ఏర్పాటు ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. జూనియర్ కళాశాలలు ఏర్పాటుచేసే ముందు తరగతుల బోధనకు అధ్యాపకులు, ఇతర సిబ్బందిని నియమించాలని, మౌలిక వసతులు సమకూర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు ఉన్నత పాఠశాలల ఆవరణలో కాకుండా మరోచోట భవనాలు నిర్మించి, జూనియర్ కళాశాలలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉచితంగా కంటి వైద్యపరీక్షలు

మహరాణిపేట, ఫిబ్రవరి 25: మధమేహ రోగులకు గ్లుకోమ, రెటీనా కంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని వాసన్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు పీజే శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాఘవేంద్ర స్వామి ఆలయం సమీపంలోని ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో క్యూ లాసిక్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రముఖ వైద్య నిపుణులతో మార్చి 31 వ తేదీ వరకు మధుమేహ రోగులకు ఉచితంగా రెటీనా, గ్లుకోమ సంబంధించి కంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు ఎన్. ప్రవీణ కుమార్ , బి. రోహిణీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో గీతం వర్సిటీకి రజత పతకం

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 25: ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో గీతం యూనివర్సిటీ రన్నరప్‌గా నిలిచి రజత పతకం సాధించింది. గుహవటిలో జరిగిన ఈ టోర్నీలో గీతం వర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన టి.సూర్యతేజ, కుశాల్ దాస్, రోహిత్ హల్దర్, ప్రణవ్‌కుమార్ రమేష్, ధ్రువ ఓజా అద్భుతంగా రాణించి రన్నరప్ ట్రోఫీని గెలిచి, జాతీయ స్థాయి పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ క్రీడాకారులతోపాటు కోచ్ ఆశిష్ పౌల్, టెక్నికల్ అఫిషియల్ డాక్టర్ డీవీఎస్‌వై.శర్మను గీతం యాజమాన్యం అభినందించింది.



రన్నరప్‌గా నిలిచిన గీతం వర్సిటీ జట్టు

న్యాయవాదుల దీక్షకు విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు

మహారాణిపేట, ఫిబ్రవరి 25: ఆంధ్రప్రదేశ్ భూ హక్కు యాజమాన్య చట్టం రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు ప్రకటించింది. ఆదివారం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పక్కి కొండబాబు, సభ్యులు అక్కడ దీక్ష శిబిరంలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పెట్ల బాల గంగాధర్ గోపి , న్యాయవాదుల సంఘం సభ్యులు పలకా శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

3న ఘంటసాల పాటల పోటీలు

సీతంపేట, ఫిబ్రవరి 25: అమర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతిని ఘంటసాల స్మారక పీఠం ఆధ్వర్యంలో మార్చి 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పీఠం ఉత్తరాంధ్ర వ్యవస్థాపకులు స్వరసమ్రాట్ డాక్టర్ టి.శరత్ చంద్ర తెలిపారు. ద్వారకానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. మార్చి 3, 4వ తేదీల్లో డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడియల్ గంధర్వ ఏపీ-2024 పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్రలో ఉన్న 9 నుంచి 80 ఏళ్ల వయసు గల గాయనీగాయకులను ఎంపిక చేస్తామన్నారు. అనంతరం గాయకుడు దాము గేదెలకు ఘంటసాల జీవన సాఫల్య పురస్కారం అందజేస్తామన్నారు. దాము గేదెల, మాధవిలక్ష్మి, పల్లి నాగభూషణ్ రావు, తెలుగు దండు సూరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా పోరుయాత్ర

పద్మనాభంరూరల్, ఫిబ్రవరి 25: బీజేపీ చేపట్టిన ప్రజా పోరుయాత్ర ఆదివారం మండలంలోని పాండ్రంగి, సామయ్యవలస, ఏనుగులపాలెం, మునివనిపాలెం తదితర గ్రామాల్లో కొనసాగింది. పలువురు నాయకులు కేంద్ర పథకాలను వివరించి, రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు పి.వి.వి.ప్రసాదరావు, పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఎం.అప్పల రమణ, పేర్రాజు, కృష్ణారావు పాల్గొన్నారు.

సీతారామ సేవా సంఘం కార్యవర్గం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో సీతారామ సేవా సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా పీల వెంకట పరదేశినాయుడు, అధ్యక్షుడిగా ఆడారి పరదేశి, ఉపాధ్యక్షుడిగా కర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా యల్లపు నాగరాజు, కార్యదర్శిగా ఆడారి శివప్రకాశ్, కోశాధికారిగా పొలమరశెట్టి త్రినాథ్‌లను ఎన్నుకున్నారు.ఎన్నికల అధికారిగా కాళ్ల శ్రీను వ్యవహరించారు.

పెద్దిపాలెంలో దళిత రచ్చబండ

ఆనందపురం ఫిబ్రవరి 25: పెద్దిపాలెంలో ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న దళిత రచ్చబండ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25: కొత్త వెంకోజీపాలెం గణేశ్ సాయి షటిల్ బ్యాడ్మింటన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. కొత్త వెంకోజీపాలెం వుడా కల్యాణ మండపం ఎదురుగా ఉన్న జీవీఎంసీ హరితవనం పార్కులో ప్రారంభమైన ఈ పోటీల్లో సుమారు 50 జట్లు తలపడ్డాయి. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. అసోసియేషన్ సభ్యులు ఆరేష్ కుమార్, దాడి ఈశ్వరరావు, ఆడారి శ్రీనివాసరావు, మద్దాల శివానందం, సత్యనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 25 : విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని డాక్టర్ జి.శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో పోలా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్య నమస్కారాలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25: మాఘమాసం సందర్భంగా కొత్తవెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో సూర్యనమస్కారాలను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్య ప్రకాశ్ శర్మ సూర్య నమస్కారాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అర్చకులు సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

'జేఏసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం'

విశాఖపట్నం, ఫిబ్రవరి 25: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాటం చేయాల్సిన ఏపీ జేఏసీ 27న నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ వాయిదా వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరండర్ లీవులు, పీఆర్సీ బకాయిలు, తదితర రూ.20వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపులుపై మినిట్స్ జారీ తప్ప ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. ఐఆర్‌ను ప్రకటించమంటే పీఆర్సీనే ఇస్తామని పేర్కొనడం బూటకమని విమర్శించారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (న లుపు) 24, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 22, క్యారెట్ 22, దొండకాయలు 36, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 210, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28 , కంద 60, దేముడు చిక్కుడు 58, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న కల్యాణ మండపాలు

సింహాచలం, ఫిబ్రవరి 25: సింహాద్రి అప్పన్న సన్నిధిలో వివాహాలు చేసుకునేందుకు వీలుగా దేవస్థానం ఆధ్వర్యంలో 50 కల్యాణమండపాల నిర్మాణం చేపట్టాలన్న అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆశయం మేరకు నిర్మించిన నాలుగు నూతన కల్యాణమండపాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. నాలుగేళ్ల క్రితం ఈ ప్రతిపాదన చేయగా పాలకమండలి ఆమోదం లభించింది. ఇందులో భాగంగా తొలిదశలో సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో శ్రీదేవి కాంప్లెక్స్ పేరుతో నాలుగు మండపాలను నిర్మించినప్పటికీ నిరుపయోగంగా ఉన్నాయి. అదే క్రమంలో సత్తెమ్మతల్లి ఆలయానికి ఎదురుగా సుమారు రెండెకరాల విస్తీర్ణంలో మరొక నాలుగు కల్యాణ మండపాల నిర్మాణాన్ని తొలుత సుమారు రూ.8కోట్లతో ప్రారంభించారు. తర్వాత నిర్మాణ వ్యయాన్ని పెంచి మరో రూ.3కోట్లను వెచ్చించి నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటితో పాటు పాటు సాధారణ భక్తులకు వసతి నిమి త్తం మొత్తం 20 గదులను సకల సదుపాయాలతో నిర్మించారు. దేవస్థానం పాలకమండలి పదవీ కాలం ఏప్రిల్ 6తో ముగియనుండటంతో వీటిని ప్రారంభించాలని ట్రస్టీలు ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పండితులను ముహూర్తం నిర్ణయించాలని ఈఓ కోరారు. వీటిని సీఎం జగన్ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్టు సమాచారం.


తుది మెరుగులు దిద్దుకుంటున్న కల్యాణ మండపాలు

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి


16వ వార్డులో ఓటరు నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25: అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పలుచోట్ల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. భాను ఎస్‌బీఐ వద్ద పార్టీ 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొల్లి శోభ, ముగడ వాసు, పల్లా ఉమారాణి, జి.అప్పన్న, మొల్లి శంకర్, బంగార్రాజు, పైడి రాజు, ఎం.సత్యనారాయణ, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. 15వ వార్డులోని వెంకటేశ్వర స్వామి ఆలయం పక్కన్న చేపట్టిన కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, సిహెచ్.గోవింద్, కె.మహేష్, నరేంద్ర, సోని, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై యువతకు అవగాహన

పద్మనాభం రూరల్: మండలంలోని మద్ది గ్రామంలో తెలుగు యువత అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం యువతకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. పార్టీ శ్రేణులు బి.మధు, బుగత శ్రీనివాసరావు, బుగత ప్రకాశ్, గిరి, భైరాగినాయుడు, గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

తెలుగుదేశం పార్టీ నాయకుడు, గీతం అధినేత శ్రీభరత్


సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న శ్రీభరత్

ఆనందపురం ఫిబ్రవరి 25: గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ తెలిపారు. మండలంలోని వేములవలసలో ఆదివారం జరిగిన ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యుల పాత్ర చాలా కీలకమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య వృత్తిని నిర్వహిస్తూ సేవలందిస్తున్నా ప్రభుత్వం నుంచి తమకు తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. ఇప్పటికైనా గుర్తింపు ఇవ్వాల్సిందిగా కోరారు. అనంతరం సంఘం ప్రతినిధులు శ్రీభరత్, పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబులను ఘనంగా సన్మానించారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అంగటి రాము, భీమిలీ నియోజకవర్గ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గుండు చిన్నబాబు, గ్రామీణ వైద్యుల సంఘం ముఖ్య నేతలు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో ముగిసిన తిరుకల్యాణోత్సవాలు

సింహాచలం, ఫిబ్రవరి 25 : సింహాచల దేవస్థానం అను బంధ ఆలయం కొండదిగువ ఉన్న పద్మావతి, అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఆది వారం రాత్రి శ్రీపుష్పయాగంతో ముగిశాయి. ఆఖరి రోజున ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను అధిష్ఠించి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పలురకాల పరిమళభరిత పుష్పాలతో విశేష అర్చనలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు యథావిధిగా జరిపారు. బాలభోగ నివేదన, సేవాకాలం తరువాత గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠించి భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపారు. అనంతరం రజిత గరుడ వాహనంపై ఉంచి మంగళవాయిద్యాలు వెంటరాగ భక్తులు స్వామిచుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేశారు.


స్వామివారికి పుష్పాంజలి నిర్వహిస్తున్న అర్చకులు

కేంద్ర పథకాలకు రాష్ట్రంలో రంగుల మార్పు

» బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్


సమావేశంలో మాట్లాడుతున్నబీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

భీమునిపట్నం, ఫిబ్రవరి 25: దేశంలో పేదల జీవితాల్లో మార్పు కోసం ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అయితే ఆంధ్ర రాష్ట్రానికి ఆ పథకాలు వచ్చేసరికి ఇక్కడి ప్రభుత్వం ఆయా పథకాలకు రంగులు మార్చేసి, వేరే పేర్లు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నదని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ ఆరోపించారు. పార్టీ ఎస్సీ మోర్చా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం భీమిలి రెల్లివీధిలో దళిత రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నాలుగు కోట్లు ఇళ్లు పేదలకు నిర్మించాలని కేంద్రం సంకల్పించి రాష్ట్రానికి 13,360 ఇళ్లు మంజూరే చేస్తే, వీటిలో కేవలం ఇప్పటికి 3,309 ఇళ్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. మిగిలినవి ఇంకెప్పుడు నిర్మిస్తుందోనని ప్రశ్నించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పంపిస్తే ఏపీలో ఆ యా నిధులను దారి మళ్లిస్తుందన్నారు. ఇలా ఎన్నో పథకాలకు ఇక్కడ సొంత పేర్లు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి కోడూరు సంజీవరావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, నాయకులు విష్ణుకుమార్‌రాజు, ఉప్పాడ అప్పారావు, కంటుభుక్త సునీత, పోలుబోతు విజయ, రాకేష్, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అవతార్ మెహర్‌బాబా జయంతి

పద్మనాభం, ఫిబ్రవరి 25 : శేరిఖండం గ్రామంలో అవతార్ మెహర్‌బాబా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఈ వేడుకల్లో ఎంపీపీ కె.రాంబాబు, మెహర్‌బాబా భక్త బృందం సభ్యులు వెంకటరావు, సురేష్, భానుప్రసాద్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో మెగా రక్తదాన శిబిరం

పద్మనాభం, ఫిబ్రవరి 25 : కృష్ణాపురం గ్రామంలో స్థానిక యూత్ సభ్యులు, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సంస్థ సంయుక్తంగా తలసేమియా పిల్లల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 40మంది దాతలు రక్తదానం చేశారు. తొలుత ఈ శిబిరాన్ని ఎంపీపీ కె.రాంబాబు ప్రారంభించారు. సంస్థ సభ్యుడు మొకర వినయ్, స్థానిక నాయకులు అప్పలనాయుడు, అచ్చింనాయుడు, అప్పలరాజు, నర్సింహనాయుడు, దేశాయి తదితరులు పాల్గొన్నారు.

జూకు పోటెత్తిన సందర్శకులు

ఆరిలోవ, ఫిబ్రవరి 25 : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. సుమారు 3,250 మంది విచ్చేసినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందని సలారియా తెలిపారు. ఈ సందర్భంగా వీరి నుంచి రూ.2,66,740ల ఆదాయం లభించినట్టు చెప్పారు.

హోమియోతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం


కేపీపీ పద్మనాభం చిత్రటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు

సిరిపురం, ఫిబ్రవరి 25 : దీర్ఘకాలిక వ్యాధులను హోమియో ద్వారా నయం చేయవచ్చునని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ సంస్థ జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సిరిపురంలోని బిల్డర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం రాత్రి సంస్థ విశాఖ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఫాస్ట్‌ఫుడ్స్, సరైన సమయంలో తినకుండా ఉండడం వలన ప్రేగులలో సమస్యలు ఏర్పడతాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో చక్కగా పనిచేస్తుందన్నారు. అంతకుముందు హోమియో నిష్ణాతులు డాక్టర్ కేపీపీ పద్మనాభం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.రాఘవేంద్రరావు, డాక్టర్ వి.హేమలత, బీఎస్ వెంకటేశ్వరరావు, శివకాంతి, రాజాశ్రీకాంత్, బీవీ అభిలాష్, ఎస్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

- డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌టీఎన్ రావూరి సుబ్బారావు



మహిళలకు సహాయం అందిస్తున్న క్లబ్ సభ్యులు

సిరిపురం, ఫిబ్రవరి 25 : రోటరీ క్లబ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ 3020 సేవలు స్ఫూర్తిదాయకమని డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌టీఎన్ రావూరి సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాడేరు ఏజెన్సీలోని పెద్దలకు చదువు చెప్పే కార్యక్రమం, మహిళలు స్వయంగా ఎదిగేందుకు కట్టుమిషన్ల పంపిణీ, శానిటరీ ప్యాడ్స్, బ్రెస్ట్ క్యాన్సర్‌పై పెద్ద ఎత్తున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, విద్య తదితర సేవలను అందించడం గర్వకారణమన్నారు. విశాఖపట్నం ప్రెసిడెంట్ సీఏ డి.మధుసూదనరావు మాట్లాడుతూ గడిచిన ఎనిమిది సంవత్సరాలుగా నిరంతరాయంగా ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డీవీవీ వర్మ, ప్రధాన కార్యదర్శి రఘుపతి పీవీ తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్సీ కార్యాలయంలో స్పందన

భీమునిపట్నం, ఫిబ్రవరి 25 : జీవీఎంసీ భీమిలి జోన్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు. ఉదయం పదకొండు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జోనల్ కార్యాలయంలో జెడ్సీ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. జోన్‌లో ఉన్న ఒకటి నుంచి నాలుగు వార్డుల ప్రజలు తమ సమస్యలపై వినతులివ్వాలని సూచించారు.

బీసీలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

» రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

ఎండాడ, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో బీసీలకు వైసీపీ ప్రభుత్వం అండగా ఉందని, వారికి అనేక రాజకీయ పదవులు కట్టబెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఎండాడలోని దిశా పోలీసుస్టేషన్ సమీపంలో యాదవ్లలకు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి అంతా కృషి చేయాల్సిందిగా కోరారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీల గౌరవాన్ని పెంచింది సీఎం జగనే అన్నారు. మాజీ మంత్రి అనీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ యాదవులంతా పార్టీ కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ హరివెంకటకుమారి, భీమిలీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ యాదవ భవన నిర్మాణానికి రూ. కోటి విరాళం ప్రకటించారు.

ఎంపీ, ఐదు ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి

మద్దిలపాలెం: ఉత్తరాంధ్రలో యాదవులకు ఒక ఎంపీ, ఐదు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావుయాదవ్ డిమాండ్ చేశారు. శివాజీపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో అత్యధికంగా యాదవులు ఉన్నారన్నారు. జనాభా ప్రాతిపదికన విశాఖ జిల్లాలో ఎంపీ, రెండు ఎమ్మెల్యే, శ్రీకాకుళం జిల్లాలో ఒక ఎమ్మెల్యే, విజయనగరం జిల్లాలో ఒక ఎమ్మెల్యే, అనకాపల్లి జిల్లాలో ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలన్నారు. ఒమ్మి సన్యాసిరావు, అప్పారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న వైసీపీ నేతలు

తీరానికి పర్యాటకుల తాకిడి


సందర్శకులతో కిటకిటలాడుతున్న రుషికొండ బీచ్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 25: సందర్శకులతో ఆదివారం రుషికొండ, సాగర్‌నగర్ తదితర బీచ్‌లు కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు బీచ్‌లకు విహారానికి తరలి వస్తుండడంతో కోలాహల వాతావరణం నెలకొంటోంది. కొందరు కుర్రకారు ద్విచక్ర వాహనాలు అతివేగంగా నడుపుతూ బీచ్‌రోడ్డుపై ప్రయాణించే వారిని హడలెత్తిస్తున్నారు. బీచ్‌రోడ్డులో గీతం ఎదురుగా ఇద్దరు ద్విచక్రవాహనంపై వేగంగా వెళుతూ అదుపుతప్పి కిందపడ్డారు. బీచ్‌లో లైఫ్ గార్డులు, కమ్యూనిటీ గార్డులు ప్రమాదాలకు జరగకుండా పహారా కాశారు.

ముడసర్లోవ పార్కులో పూర్వ విద్యార్థుల సందడి


పార్కులో కలుసుకున్న తోటగరువు పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆరిలోవ, ఫిబ్రవరి 25: తోటగరువు హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం ముడసర్లోవ పార్కులో సందడి చేశారు 2003-2004 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వీరంతా రెండు దశాబ్దాల తరువాత కలుసుకోవడంతో ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. అనంతరం హెచ్ఎం వరహాలురాజును సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేసి సరదాగా గడిపారు.

అమృత ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ఔషధ మొక్కలను పరిశీలిస్తున్న ఈవో

సింహాచలం, ఫిబ్రవరి 25: సేంద్రీయ ఎరువులతో పండించిన అమృతతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో సింహాచల దేవస్థానం నృసింహవనంలో ఆదివారం జరిగిన కూరగాయల మొక్కలకు అట్టుకట్టు శిక్షణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడు తూ కూరగాయల మొక్కలకు అంట్లు కట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి,వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు ఆకుల చలపతిరావు, విజయరాజు, కర్రి రాంబాబు, దాట్ల సుబ్రహ్మణ్యవర్మ, గ్రీన్‌క్లైమేట్ సంస్థ ప్రతినిధి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎనిమిది రకాల వంగనారు, టమాటా, పచ్చిమిర్చి, ఉల్లి, మూడురకాల బంతి, విత్తనాలు, నారులను పంపిణీ చేశారు.

ట్రాఫిక్ ఎస్‌ఐపై మందుబాబు వీరంగం


ఎస్ఐ బైక్‌ను అడ్డుకున్న మందుబాబు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 25: మూడో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మనోహర్‌పై ఓ మందుబాబు వీరంగం సృష్టించాడు. బీచ్‌రోడ్డులో ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం ఎస్ఐ వెళుతుండగా అడ్డుకున్నాడు. బైక్ హ్యాండిల్ కదలనీయకుండా పట్టుకుని అతనిపై చిందులు వేశాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో తన బంధువులనే ఆపుతావా.. అంటూ చెలరేగిపోయాడు. అంతటితో ఆగక ఎస్ఐకి వార్నింగ్ ఇచ్చారు. దీనిపై ఎస్ఐ మౌనంగా ఉండిపోయారు. ఈ విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సదరు మందుబాబును స్టేషన్‌కు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, ఫిబ్రవరి 25 : విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-3 ఆపరేషన్స్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కైలాసగిరి 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా హనుమంతవాక జంక్షన్ నుంచి కైలాసగిరి రోడ్డులో విద్యుత్ స్తంభాల మార్పులు తదితర పనులను చేపట్టనున్నామని వివరించారు. ఈ కారణంగా హనుమంతవాక జంక్షన్, శ్రీరామ్‌నగర్, రామాలయం వీధి, పోలీసు మైదానం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

తొమ్మిదో వార్డులో ఓటరు నమోదు శిబిరం

ఆరిలోవ, ఫిబ్రవరి 25 : జీవీఎంసీ తొమ్మిదో వార్డు టీడీపీ ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో ఆదివారం సంజయగాంధీ కాలనీ సర్వీసు రోడ్డులో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్ధెనిమిది సంవత్సరాలు నిండినవారంతా ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి బాదరు బాలరాజు, 12 వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం ఈశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు ఎమ్మెల్యే అభినందనలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 25 : ఇండియన్ మోడ్రన్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీల్లో విజేతలను తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అభినందించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల్లో విజేతలకు బెల్టులు, ధ్రువపత్రాలను అందజేశారు. చీఫ్ కోచ్ ఎం.వి.రమణ, ఇన్‌స్ట్రక్టర్ భైరెడ్డి కొండలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంకారీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరిశుభ్రత



చెత్తను తొలగిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఎండాడ, ఫిబ్రవరి 25: స్థానిక ఎండాడ చెరువు ప్రాంగణంలోని సంత్ నిరంకారీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చెత్తాచెదారాన్ని తొలగించి, పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. చెరువు ప్రాంతంలోని ప్లాస్టిక్ కవర్లు, చెత్తాను తీసి గన్నీ బ్యాగ్‌లలో వేసి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పీవీరావు, జి.రాజీవ్, రాంబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష


తిమ్మాపురం కేంద్రంలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 25 : గ్రూప్-2 ఉద్యోగాలకు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురం వరల్డ్ వన్ స్కూల్‌లో ప్రశాంతంగా జరిగింది. ఇక్కడ 350 మంది అభ్యర్థులకు సెంటర్‌ను కేటాయించగా, వీరిలో 88మంది పరీక్షకు హాజరు కాలేదని అధికారులు తెలిపారు. ఈ కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.